ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 03 సంచిక -36 పేజీలు - 8 వెల - 03/- శనివారం 23 మే 2026

# ఐఏఎస్‌ల పిల్లలకు రిజర్వేషన్ ఎందుకు..


## సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు

**మిగతా వారికి కూడా ఈప్రయోజనం అందవద్దా**

**కొందరికే రిజర్వేషన్లు దక్కితే మిగతా ప్రజలు ఏం కాను**

**ఇలా అయితే దేశంలో రిజర్వేషన్ల నుంచి బయటపడేనా**

**ఐఏఎస్ తల్లిదండ్రుల పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా**





**న్యూఢిల్లీ,మే 22,(రిపబ్లిక్ న్యూస్):** రిజర్వేషన్లపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. **మిగతా 2లో...**

# రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**ఎపిలో 4 స్థానాలతో పాటు పది రాష్ట్రాల్లో ఎన్నిక**

**జూన్, జులై నెలల్లో ముగియనున్న 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం**

**జూన్ 18న పోలింగ్.. అదే రోజున ఫలితాలు**

**ఏపీలో 4 స్థానాలు కూటమి ఖాతాలోకి వెళ్లడం లాంఛనమే**



**న్యూఢిల్లీ** దేశంలో పది రాష్ట్రాల్లోని 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీ కాలం మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. దేశంలో మొత్తం 10 రాష్ట్రాల్లో 24 రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయని పేర్కొంది. జూన్ 1న ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపింది. జూన్ 1 నుంచి జూన్ 8 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొంది. జూన్ 9న నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, జూన్ 11న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపింది. జూన్ 18న ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. **మిగతా 2లో...**

# 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ

**అటవీశాఖకు టార్గెట్ విధించిన డిప్యూటీ సీఎం**




**అమరావతి,మే 22,(రిపబ్లిక్ న్యూస్):** అటవీ శాఖ ఆధ్వర్యంలో 2.5 కోట్ల విత్తన బంతులను పంపిణీ చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. వీటి తయారీ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని అన్నారు. అందుకు అన్ని వర్గాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. **మిగతా 2లో...**

# రాయలసీమలో మెగా సోలార్ ప్రాజెక్టు ప్రారంభం...

**సోషల్ మీడియా వేదికగా స్పందించిన సీఎం చంద్రబాబు**

**రూ.3000 కోట్ల పెట్టుబడితో 11 నెలల్లోనే నిర్మాణం పూర్తి**

**పరిశుభ్ర ఇంధన రంగంలో ఏపీ ముందు వరుసలో ఉందని వెల్లడి**

**రికార్డు సమయంలో ప్రాజెక్ట్ పూర్తి చేసిన ఎస్ఏఈఎల్ బృందానికి అభినందనలు**




**జమ్మలమడుగు మే 22,(రిపబ్లిక్ న్యూస్):** కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3,000 కోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (సాజుూ) 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ఏపీ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. దీనిపై సీఎం చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రికార్డు సమయంలో ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు. "వ్యాపార నిర్వహణ వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్), కార్యనిర్వహణ వేగం (స్పీడ్ ఆఫ్ ఎగ్జిక్యూషన్) రెండూ కలిసిన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ అని చెప్పడానికి నేను గర్వపడుతున్నాను. ఈ రోజు, రాయలసీమలో ఎస్ఏఈఎల్ సంస్థ నిర్మించిన 600 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును మన ప్రజలకు అంకితం చేశాం. రూ.3,000 కోట్ల పెట్టుబడితో కేవలం 11 నెలల రికార్డు సమయంలో ఈ చరిత్రాత్మక **మిగతా 2లో...**




# హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం

**విశాఖలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ఎపి ప్రభుత్వం**

**లాంఛనంగా ప్రారంభించిన హోంమంత్రి అనిత**

**విశాఖపట్నంమే 22,(రిపబ్లిక్ న్యూస్):** విశాఖలో హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొని కేంద్రాన్ని ప్రారంభించారు. దేశంలోనే మొదటిసారిగా హోంగార్డులకు ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. సుమారు రూ.33 లక్షల వరకు బీమా కవరేజ్‌ను పొందవచ్చు. హోం మంత్రి అనిత ప్రోత్సాహంతో మొదటి విడతగా 975 మంది హోంగార్డులకు ఆరోగ్య బీమాను అందించనున్నారు. ఈ బీమా పథకం కింద భర్త, భార్య, ఇద్దరు పిల్లల వరకు కవరేజ్ ఉంటుంది. ఈ సందర్భంగా హోం మినిస్టర్ అనిత మాట్లాడుతూ.. పోలీసు వారికి వర్తించే ఆరోగ్య భద్రత.. **మిగతా 2లో...**

# మైన్స్, ఎక్సైజ్ శాఖలను ప్రక్షాళన చేస్తున్నాం

**రాయలసీమ ప్రాంతంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం**

**ఇసుక, క్వారీ నిధుల విషయంలో అనుమతులు ఇవ్వాలి**

**నేరాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి**

**రాష్ట్ర ఎక్సైజ్, గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**



7లో.

# డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో రోల్ మోడల్ గా తెలంగాణ...


**పౌర సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా 'కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్'**

**ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్ ను అనుసంధానించేలా 'ఎకో సిస్టం'**

**'డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు**




2లో.



# అగ్నిగుండంలా ఆంధ్రప్రదేశ్...

2లో.

**రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**చలివేంద్రాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశం**

**తీవ్ర ఉష్ణోగ్రతలున్న ప్రాంతాల్లో స్థానికంగా సెలవులు ప్రకటించాలని సూచన**

**గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని స్పష్టం**

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888



# రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**మొదటిపేజీ తరువాయి**

అదే రోజు కౌంటింగ్ నిర్వహించి.. ఫలితాన్ని ప్రకటిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటకలో నాలుగేసి స్థానాలకు, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో మూడేసి, జార్ఖండ్‌లో రెండు, మణిపూర్, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరంలో ఒక్కో రాజ్యసభ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. జూన్ 21తో వైసిపి నుంచి ఎంపికైన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వాని, పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో పాటు టిడిపి నుంచి ఎంపికైన సానా సతీష్ పదవీ కాలం ముగియనుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమిలోని పార్టీలకు 164 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. దాంతో ఈ నాలుగు రాజ్యసభ స్థానాలు ఆయా పార్టీలు సొంతం చేసుకునే అవకాశం ఉంది.

# హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం

**మొదటిపేజీ తరువాయి**

హోంగార్డులకు వర్తించకపోవడం, వారి వేతనాలు తక్కువగా ఉండటం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏడాది రూ.3 లక్షల నుంచి రూ.33 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. దీని ద్వారా సుమారు 3,140 మంది లబ్ది పొందనున్నారని తెలిపారు. హోంగార్డుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పూర్తి ఉచితంగా ఈ బీమా సదుపాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. విధుల్లో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు తిరిగి ఉద్యోగం కల్పించే పరిస్థితి లేనందున.. ఆ కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా ఈ ఆరోగ్య బీమా ఎంతో సహాయపడుతుందని హోం మంత్రి అనిత వివరించారు.

------------

# 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ

**మొదటిపేజీ తరువాయి**

ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖపై పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ నెలలో నిర్వహించనున్న విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమంపై అధికారులకు ఆయన దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాకాల సీజన్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా విత్తన బంతులను విస్తారంగా చల్లడానికి అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఇందుకోసం మూడు రకాల ప్రత్యేక పద్ధతులను ఉపయోగించాలని సూచించారు. నేరుగా చల్లడం, అత్యాధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించడం, చేతులతో నాటడం చేయాలని ఆయన పేర్కొన్నారు. అడవుల్లో జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం, స్వచ్ఛమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం ఈ హరిత ఉద్యమ ప్రధాన లక్ష్యమని పవన్ చెప్పుకొచ్చారు. విత్తనం చల్లే ప్రతి విత్తన బంతి.. మన భవిష్యత్తుకు ఇచ్చే ఒక నమ్మకమైన హామీగా మారాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే తరాల కోసం ఆంధ్రప్రదేశ్‌ను మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా, సుస్థిరంగా మార్చేందుకు మనమంతా చేతులు కలపాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# అగ్నిగుండంలా ఆంధ్రప్రదేశ్...

## రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులపై సీఎం చంద్రబాబు సమీక్ష


**అమరావతి,మే 22,(రిపబ్లిక్ న్యూస్):**

రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రత దృష్ట్యా ఏపీలోని కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో, చేపట్టాల్సిన సన్నద్ధత చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హీట్‌వేవ్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన చోట్ల టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీటి ద్వారా ప్రజలకు చల్లని నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎండల తీవ్రత అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించే విషయాన్ని పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎండల తీవ్రత, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని నిర్దేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య, పురపాలక, పంచాయితీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అగ్ని-1 బాలిస్టిక్ క్షిపణ పరీక్ష విజయవంతం

**చాందీపూర్,మే 22,(రిపబ్లిక్ న్యూస్):**



స్వల్పశ్రేణి లక్ష్యాలను ఛేదించే అగ్ని-1 బాలిస్టిక్ క్షిపణ పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరంలోని చాందీపూర్‌లోనున్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి వ్యూహాత్మక దళాల కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారంనాడు ఈ క్షిపణ పరీక్ష జరిగింది. ఉపరితలం నుంచి ఉపరితలం పైకి దాడి చేసే స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి పరీక్షను ఎస్ఎఫ్‌సీ విజయవంతంగా ప్రయోగించి నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షతో అన్ని కార్యాచరణ, సాంకేతిక పరిమితులను విజయవంతంగా ధ్రువీకరించినట్టు పేర్కొంది. గత ఏడాది జూలైలోనూ ఇదేతరహా పరీక్షను డీఆర్‌డీఓ విజయవంతంగా నిర్వహించింది. ఈ క్షిపణి 700 నుంచి 1,200 కిలోమీటర్ల లక్షాలను సునాయాసంగా ఛేదించగలదు. అణ్వాయుధాలను మోసుకెళ్లే శక్తివంతమైన క్షిపణిగా దీనిని డీఆర్‌డీఓ అభివృద్ధి చేసింది. కాగా, ఈనెల మే 8న అడ్వాన్స్ అగ్ని మిజైల్‌ను ఒడిస్సాలోని అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఇండియా విజయవంతంగా పరీక్ష చేసింది. మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టా÷-గ్గ÷టెడ్ రీ-ఎంట్రీ వెహికల్ సిస్టమ్ (ఎంఐఆర్‌వీ)తో ఈ క్షిపణి పరీక్ష నిర్వహించారు. వేర్వేరు ప్రదేశాల్లో ఉన్న బహుళ లక్ష్యాలను ఈ క్షిపణి విజయవంతంగా ఛేదించింది. ఇండియాకు పెరుగుతున్న ముప్పు అవకాశాలను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సన్నద్ధతను ఎంఐఆర్‌వీ చాటిచెప్పిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీఓను ప్రశంసించారు.

---------------

# రాయలసీమలో మెగా సోలార్ ప్రాజెక్టు ప్రారంభం...

**మొదటిపేజీ తరువాయి**

ప్రాజెక్టును పూర్తి చేయడం జరిగింది. సుస్థిర భవిష్యత్తు పట్ల మాకున్న తిరుగులేని నిబద్ధతకు ఇది నిదర్శనం. భారతదేశ స్వచ్ఛ ఇంధన ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెడుతున్న ఇలాంటి ప్రాజెక్టులు మాకు ఎంతో గర్వకారణం. ఈ ప్రాజెక్టును ఇంత తక్కువ సమయంలో పూర్తి చేసిన ఎస్ఏఈఎల్ ఇండియా బృందానికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ ప్రాజెక్టు ద్వారా మన ప్రజలకు ఉద్యోగాలు, అభివృద్ధి, కొత్త అవకాశాల రూపంలో గణనీయమైన ప్రయోజనాలు చేకూరుస్తాయని నేను మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# ఐఏఎస్‌ల పిల్లలకు రిజర్వేషన్ ఎందుకు..

ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమిలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించు కుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్నీ' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ఆస్కార్ స్థాయి నటుడు జగన్

**తల్లిని, చెల్లిని గెంటేసిన మహానుభావుడు**

**రాజకీయం కోసం కుట్రలు, నాటకాలు అలవాటు**

**మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు**



**అమరావతి,మే 22,(రిపబ్లిక్ న్యూస్):**

మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అద్భుత నటుడని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సినిమాల్లో నటిస్తే జగన్‌కు కచ్చితంగా ఆస్కార్ అవార్డ్ వస్తుందని ఎద్దేవా చేశారు. ఆస్తి కోసం సొంత తల్లి, చెల్లిని బయటకు గెంటేశారని.. ఇంకో చెల్లి తండ్రిని చంపి అన్యాయం చేశారంటూ మంత్రి ఆరోపించారు. సొంత జిల్లా ప్రజలను మోసం చేశారని.. సొంత బాబాయిని లేపేసి నెపం టీడీపీపై నెట్టారని మండిపడ్డారు. వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో లోకేశ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. వైఎస్ వివేకాది గుండెపోటు కాదని.. గొడ్డలి పోటు అంటూ ఆరోపణలు గుప్పించారు. గతంలో జగన్ కోడికత్తి, గులకరాయి డ్రామాలు చూశామని.. మొన్న కడపలోనూ అలాంటి కుట్రే జరిగిందన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూశారని.. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదని మంత్రి లోకేశ్ హెచ్చరించారు. రప్పా, రప్పా అంటే భయపడేవారు ఎవరూ లేరని.. మీ నాయకుడిని, వారి తండ్రినీ చూశామని వైసీపీ కార్యకర్తలకు చురకలు అంటించారు. ప్పా, రప్పాకు ఎండ్ కార్డ్ వేసే బాధ్యత తనదంటూ మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు. రెడ్ బుక్ అంటేనే భయపడుతున్నారని.. చివరకు ఎర్ర కారు చూసినా బెదిరిపోతున్నారని వైసీపీ నేతలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ రెడ్డి వారంలో ఒక రోజు మాత్రమే ఏపీలో ఉంటున్నారని.. మూడు రోజులు బెంగళూరులో, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో ఉంటున్నారని లోకేశ్ తెలిపారు. జగన్‌కు సీసీడీ (క్రెడిట్ చోరీ డిజార్డర్) వ్యాధి ఉందని.. వైసీపీ కుట్రలపై అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సందర్భంగా గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో జమ్మలమడుగుకు అనేక పరిశ్రమలు వస్తాయని తెలిపారు. రాయలసీమ స్టీల్ ఎ÷-లాంట్‌ను 2029 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కష్టకాలంలో పసుపుజెండాకు అండగా నిలబడిన వ్యక్తి భూపేశ్ రెడ్డి అని మంత్రి ప్రశంసించారు. ఆయనకు మాటలు తక్కువ.. చేతలు ఎక్కువని కొనియాడారు. జమ్మలమడుగు జోష్ అదిరిపోయిందని.. గండికోటను, టీడీపీని ఎవరూ టచ్ చేయలేరని మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు.

# విజ్ఞాన్ యూనివర్సిటీ-ఐఎండీ కీలక ఒప్పందం...

**ఏపీ రైతులకు అత్యాధునిక వాతావరణ సేవలు**

**అమరావతి,మే 22,(రిపబ్లిక్ న్యూస్):**



ఆంధ్రప్రదేశ్ రైతులకు వ్యవసాయంలో అండగా నిలిచేందుకు విజ్ఞాన్ యూనివర్సిటీ ముందుకొచ్చింది. అత్యాధునిక, కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని పొలం స్థాయిలోనే రైతులకు అందించేందుకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ)తో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పంద పత్రాలను ఢిల్లీలో విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.వి. కృష్ణ కిషోర్, ఐఎండీ కార్యదర్శి డాక్టర్ ఎం. రవిచంద్రన్ మార్చుకున్నారు.

ఈ ఒప్పందం ప్రకారం, ఐఎండీ తమ వద్ద ఉన్న అత్యంత కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని 1-2 కిలోమీటర్ల పరిధిలో ఏపీఐల ద్వారా విజ్ఞాన్ యూనివర్సిటీకి అందిస్తుంది. ఈ డేటాను విశ్లేషించి, పంటల ప్రణాళిక, నీటిపారుదల యాజమాన్యం, పురుగుమందుల వాడకం, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడుకోవడం వంటి అంశాలపై విజ్ఞాన్ రైతులకు నిర్దిష్ట సలహాలు, సూచనలు అందిస్తుంది.

ఈ భాగస్వామ్యం ద్వారా వాతావరణ శాస్త్ర పరిజ్ఞానాన్ని వ్యవసాయ పరిశోధనలతో అనుసంధానం చేస్తున్నామని విజ్ఞాన్ వీసీ ప్రొఫెసర్ కృష్ణ కిషోర్ వివరించారు. దీనివల్ల వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతల వంటి సవాళ్లను రైతులు సమర్థంగా ఎదుర్కోగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ ఒప్పందంతో వాతావరణ శాస్త్రం, వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో పరిశోధనలకు, విద్యా కార్యక్రమాలకు ప్రోత్సాహం లభిస్తుందని నరసరావుపేట ఎంపీ, విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తల మధ్య శిక్షణా కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టులకు కూడా ఇది దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా వ్యవసాయ రంగంలో శాస్త్రీయ విధానాలను ప్రోత్సహించడం సులభతరం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

# డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో రోల్ మోడల్ గా తెలంగాణ...

**'డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,మే22(ఆర్ఎన్ఎ):**డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా... ప్రభుత్వ పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజల ముంగిటకే చేర్చేలా ఒక ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. దిఇన్స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో శుక్రవారం నోవాటెల్ హెచ్ఐసీసీలో నిర్వహించిన 'డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ÷నాన్స్ సమ్మిట్ 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ప్రస్తుతం గ్లోబల్ ఎకానమీ ఊహించని వేగంతో డిజిటల్ వైపు దూసుకుపోతోందని, సంప్రదాయ పద్ధతుల స్థానంలో వ్యవస్థను రీ-డ్జి÷న్ చేసే సరికొత్త డిజిటల్ ఈక్వేషన్స్ తెరపైకి వచ్చాయన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కు అనుగుణంగా మార్పుల్ని అందిపుచ్చుకునే దేశాలకే భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రపంచం లోనే అతిపెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్నారు. డిజిటల్ పేమెంట్స్ నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్టక్చర్ వరకు... మనం సాధిస్తున్న పరివర్తనను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో భారత్ సాధిస్తున్న ప్రగతికి తెలంగాణ ఒక గ్రోత్ ఇంజన్ లా మారిందన్నారు. భావితరాల అవసరాలకు అనుగుణంగా నెక్ట్స్ జనరేషన్ ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్.. ఈ మూడింటినీ నడిపించే ఒక బలమైన ఎకోసిస్టంను ఇప్పటి నుంచే అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో మన వాటాను10 శాతానికి చేర్చాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. ఒకప్పుడు కేవలం సంప్రదాయ బుక్ కీపింగ్, అకౌంట్స్ ఆడిటింగ్‌కే పరిమితమైన సీఏలు.. నేడు కార్పొరేట్ సంస్థలకు 'స్ట్రాటజిక్ బిజినెస్ అడ్వైజర్స్'గా రూపాంతరం చెందారన్నారు. ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్ వల్ల ÷నాన్స్ రంగంలో సరికొత్త అవకాశాలు... అదే స్థాయిలో సైబర్ మోసాలు, డీప్‌ఫేక్స్, సైబర్ అరెస్ట్, క్రిఎ÷-టో ఫ్రాడ్స్ తదితర సవాళ్లు కూడా తెరపైకి వచ్చాయన్నారు. ఇలాంటి తరుణంలో సీఏలు కేవలం ÷నాన్షియల్ ఆడిటింగ్‌కే పరిమితం కాకుండా... 'సైబర్ అష్యూరెన్స్'కూ ప్రాధాన్యమివ్వాల్సిన అవసరముందన్నారు. మారుతున్న ట్రెండ్స్ కు స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ పై దృష్టి సారించాలని సూచించారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఅండ్ఏజీ ఆనంద్ మోహన్ బజాజ్, సెర్ట్ ? ఇన్ జాయింట్ డైరెక్టర్ అభిషేక్ సోలంకి, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఇన్ కం ట్యాక్స్ ఇన్వెస్టిగేషన్ రాజగోపాల్ శర్మ, సెబీ సీజీఎం సాహిల్ మాలిక్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్, ఆర్బీఐ సీజీఎం శైలజా రాణి జంపాల, ఎన్ ఎస్ ఈ సీఐఎస్వో రాజేష్ థాపర్, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఈవో వినాయక్ గాడ్సే తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో జనసేన నేత మృతి

### తాడిపత్రిలో విషాదం

### కిరణ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన టి.సి.వరుణ్



**అనంతపురం / తాడిపత్రి క్రైమ్, మే 22 (రిపబ్లిక్ న్యూస్):**
తాడిపత్రిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జనసేన పార్టీ నాయకుడు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. జనసేన పార్టీ తాడిపత్రి రూరల్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందారు. యువ నాయకుడి మరణ వార్త తెలిసిన వెంటనే జనసేన శ్రేణులు దిగ్భ్రాంతికి గురై శోకసంద్రంలో మునిగిపోయారు.పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసిన కిరణ్‌కుమార్ మృతి పార్టీకి తీరని లోటుగా భావిస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న జనసేన జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టి.సి.వరుణ్ మృతుడి స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కిరణ్‌కుమార్ తల్లిదండ్రులు, బంధువుల రోదనలు చూసి ఆయన భావోద్వేగానికి గురయ్యారు.ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ పార్థివదేహానికి ఘన నివాళులు అర్పించారు.

**కిరణ్ కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తాం**

ఈ సందర్భంగా టి.సి.వరుణ్ మాట్లాడుతూ పార్టీ కోసం కిరణ్‌కుమార్ ఎంతో నిబద్ధతతో పనిచేశారని, ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనల మేరకు కిరణ్ కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఆపద సమయంలో పార్టీ కుటుంబానికి తోడుగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం జనసేన నాయకులు, కార్యకర్తలు కిరణ్‌కుమార్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**అనంతపురం, మే 22,(రిపబ్లిక్ న్యూస్):**
భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ 2027 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రదానం చేయనున్న "పద్మ అవార్డ్స్ "కు ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారులు తెలిపారు.కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్ఇంజినీరింగ్, ప్రజా సంబంధాలు, సివిల్ సర్వీసెస్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.అర్హులైన అభ్యర్థులు తమ వివరాలను రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎన్. రవిశంకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.మరిన్ని వివరాలకు 9959517370 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# నేటితో ముగియనున్న ఎల్ఆర్‌యస్ మేళా

### పెండింగ్ సమస్యలకు ప్రత్యేక పరిష్కారం.. చివరి అవకాశాన్ని వినియోగించుకోండి



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 22)**
(లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ప్రజల కోసం నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న ప్రత్యేక ఎల్ఆర్‌యస్ మేళా ముగియనుందని నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు.శుక్రవారం నిర్వహించిన మేళాకు విశేష స్పందన లభించిందని ఆయన వెల్లడించారు. మొత్తం 21 మంది దరఖాస్తుదారులకు అప్రూవల్ ప్రొసీడింగ్స్ జారీ చేయగా, దీనివల్ల నగరపాలక సంస్థకు రూ.39.63 లక్షల ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మేళా కొనసాగనుంది.ఎల్ఆర్‌యస్ దరఖాస్తులకు సంబంధించిన షార్ట్‌ఫాల్ పత్రాలు, ఫీజు ఇంటిమేషన్, ఫీజు చెల్లింపులు, అప్రూవల్ ప్రొసీడింగ్స్ వంటి అన్ని అంశాలను ఒకేచోట పరిష్కరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు.ఇప్పటికే దరఖాస్తు చేసుకుని ఫీజులు చెల్లించని వారు, అవసరమైన పత్రాలు సమర్పించని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్‌టిపిలు అందుబాటులో ఉండటంతో అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించుకుని అప్రూవల్ ప్రొసీడింగ్స్ పొందవచ్చన్నారు.ఈ ప్రత్యేక మేళా శనివారంతో ముగియనున్న నేపథ్యంలో ప్రజలు చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆస్తులకు పూర్తి చట్టబద్ధత కల్పించుకోవాలని కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు.

# జీసీ రామన్నను పరామర్శించిన జేసీ దివాకర్‌రెడ్డి

### ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా -ముచ్చటించిన టీడీపీ సీనియర్ నేతలు



**అనంతపురం అర్బన్, మే 22,(రిపబ్లిక్ న్యూస్):**తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, అనంతపురం మాజీ పార్లమెంట్ సభ్యుడు జేసీ దివాకర్ రెడ్డి శుక్రవారం అనంతపురం నగరంలోని అరవిందనగర్‌లోని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జీసీ రామన్న నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న రామన్న ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా తీశారు.ఈ సందర్భంగా జేసీ దివాకర్‌రెడ్డి దాదాపు గంటసేపు రామన్నతో సమావేశమై ఆరోగ్య పరిస్థితి, వైద్య చికిత్స, ప్రస్తుతం తీసుకుంటున్న జాగ్రత్తల గురించి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, త్వరగా కోలుకుని మళ్లీ ప్రజల మధ్య చురుకుగా ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిసింది. అనంతపురం రాజకీయాల్లో, సహకార రంగంలో జీసీ రామన్న చేసిన సేవలను ఈ సందర్భంగా జేసీ దివాకర్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. పార్టీ బలోపేతానికి, నాయకుల మధ్య సమన్వయానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఇద్దరు నాయకులు కొంతసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.జేసీ రాకతో రామన్న నివాసం వద్ద రాజకీయ కార్యకర్తలు, అభిమానుల్లో సందడి నెలకొంది. జేసీ దివాకర్‌రెడ్డిని చూసేందుకు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. నాయకుల మధ్య జరిగిన ఆత్మీయ భేటీ స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ఈ కార్యక్రమంలో శింగవరం రవి, జీసీ రామానాయుడు, పప్పూరు నాయుడు తదితరులు పాల్గొన్నారు. వారు కూడా రామన్న ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# టిడిపి నేత మాసినేని రామయ్యకు ఘన నివాళి

**మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి పార్థివదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**పార్టీకి ఆయన సేవలు చిరస్మరణీయం : నేతల నివాళి**

**అనంతపురం క్రైమ్, మే 22,( రిపబ్లిక్ న్యూస్ ):**
అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త, మాసినేని గ్రాండ్ హోటల్ యజమాని మాసినేని రామయ్య మృతి పట్ల రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పార్టీకి అంకితభావంతో సేవలందించిన రామయ్య మరణం తీరని లోటని నేతలు పేర్కొన్నారు. శుక్రవారం రామయ్య పార్థివదేహానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర , అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ కలిసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను



పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**అందరికీ ఆప్తుడిగా నిలిచిన రామయ్య మృతి బాధాకరం**

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పట్ల రామయ్యకు అపారమైన అభిమానం ఉండేదని, పార్టీ బలోపేతానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజలతో



సత్సంబంధాలు కొనసాగిస్తూ అందరికీ ఆప్తుడిగా నిలిచిన రామయ్య మృతి బాధాకరమన్నారు.రామయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీటి నివాళులు అర్పించారు.

# తెలుగు సాహిత్యంలో యమున రాణికి డాక్టరేట్

### మల్లాది వెంకటకృష్ణమూర్తి సాంఘిక నవలలపై పరిశోధన

**అనంతపురం సాహిత్యం, మే 22,( రిపబ్లిక్ న్యూస్):**
శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ తెలుగు సాహిత్య విభాగంలో పరిశోధన నిర్వహించిన జి.యమున రాణికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ అధికారులు శుక్రవారం వెల్లడించారు. 'మల్లాది వెంకటకృష్ణమూర్తి తొలి దశకం సాంఘిక నవలలు పాత్ర చిత్రణ' అనే అంశంపై ఆచార్య మాడిగుల ప్రఫుల్ల పర్యవేక్షణలో, డాక్టర్ మల్లా పెంచల ప్రసాద్ సహకారంతో ఆమె సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయం ఆమోదించింది. మల్లాది వెంకటకృష్ణమూర్తి రచనలలో మధ్యతరగతి జీవనం, కుటుంబ సంబంధాలు, మహిళా



పాత్రల భావ ప్రపంచం, సామాజిక మార్పుల ప్రతిబింబం వంటి అంశాలను యమున రాణి తన పరిశోధనలో



SRI SATHYA SAI INSTITUTE OF HIGHER LEARNING
(Deemed to be University)
Vidyagiri, Prasanthi Nilayam - 515 134, Sri Sathya Sai District, Andhra Pradesh, India

SSSIHL/CONEX/PHD-11F/1796 Certificate No. D26005

PROVISIONAL CERTIFICATE

This is to certify that the candidate has qualified for the Degree of

*Doctor of Philosophy*
*in*
*Telugu Literature*

in this Institute, as per the details below:

| | | |
|---|---|---|
| Name of the Candidate | : | G Yamuna Rani |
| Registered No. | : | 21021001 |
| Subject | : | Telugu Literature |
| Department | : | Languages and Literature |
| Faculty | : | Humanities & Social Sciences and Languages & Literature |
| Title of the Thesis | : | Malladi Venkata Krishna Murthi Tolidasakam Sanghika Navalalu - Patrachitrana |
| Date of Defence Viva-voce | : | 15th May 2026 |

Prasanthi Nilayam
Date: 16 MAY 2026

Controller of Examinations

విశ్లేషించారు. పాత్రల నిర్మాణం, కథన శైలి, సామాజిక స్పృహను శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేసినట్లు అధ్యాపకులు తెలిపారు. డాక్టర్ జి. యమున రాణి గత ఏడు సంవత్సరాలుగా శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థలో సహాయ ఆచార్యురాలిగా సేవలందిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలు సమర్పించడంతో పాటు కవితలు, వ్యాసాలు, పుస్తకాలు రచించారు. సాహిత్య, సామాజిక రంగాల్లో ఆమె చేస్తున్న సేవలను విశ్వవిద్యాలయ అధికారులు అభినందించారు. ఈ నెల 15న వైవా పరీక్ష నిర్వహించగా, 16న విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సాహితీవేత్తలు జి.యమున రాణికి అభినందనలు తెలిపారు.

# విద్య ఆణిముత్యాలకు ప్రతిభా పురస్కారాలు

### వచ్చే ఏడాది ఉత్తీర్ణత శాతం మరింత పెంచాలి -ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ ఆనంద్

**అనంతపురం / రాయదుర్గం మే 22,(రిపబ్లిక్ న్యూస్):**
రాయదుర్గం పట్టణంలోని జయంతి రాధాకృష్ణ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన "రాయదుర్గం విద్య ఆణిముత్యాల ప్రతిభా పురస్కారాలు " కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు.

**విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగం పురోగతిపై సంతోషం వ్యక్తం చేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి పదో తరగతి ఫలితాల్లో ఏడు శాతం అధిక ఉత్తీర్ణత



నమోదైందన్నారు. గతంలో 70 శాతం ఉత్తీర్ణత ఉండగా, ఈ ఏడాది అది 77 శాతానికి చేరడం అభినందనీయమని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఈ శాతాన్ని మరింత పెంచేందుకు అధికారులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించిన వారు, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, డిజిటల్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలకన్నా ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు మెరుగ్గా రావడం గర్వకారణమన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది.

# సీఎం సహాయ నిధి పేదలకు వరం

**మంత్రి సత్య కుమార్ యాదవ్**

**రూ.46 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు అండగా ఎన్డీఏ ప్రభుత్వం**

**70 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన మంత్రి సత్యకుమార్**



**శ్రీ సత్య సాయి ప్రతినిధి, మే 22,(రిపబ్లిక్ న్యూస్):**
అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన 70 మంది లబ్ధిదారులకు రూ.46,14,337 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి స్వయంగా పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

**913 మంది లబ్ధిదారులకు రూ.9.65 కోట్ల ఆర్థిక సహాయం**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం వారి పక్కనే ఉండాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు అవసరమైన సమయంలో ఆర్థిక చేయూత అందిస్తున్నామని చెప్పారు.ఇటీవల పది రోజుల క్రితమే దాదాపు రూ.30 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని, మళ్లీ ఇప్పుడు మరో 70 మందికి రూ.46 లక్షలకు పైగా సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి వేగంగా స్పందిస్తోందని పేర్కొన్నారు.జూన్ 12 నాటికి ఎన్డీఏ ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో, ఈ రెండేళ్ల కాలంలో ధర్మవరం నియోజకవర్గంలో మొత్తం 913 మంది లబ్ధిదారులకు రూ.9.65 కోట్ల మేర ఆర్థిక సహాయం సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీల ద్వారా అందించామని మంత్రి వెల్లడించారు. ప్రమాదాలు, దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న కుటుంబాలకు భారీ వైద్య ఖర్చుల భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఒకవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలను బలోపేతం చేస్తూనే మరోవైపు ఖరీదైన వైద్య చికిత్సలతో ఇబ్బందులు



పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అండగా నిలుస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్ల రూపాయలను ప్రజల వైద్య అవసరాల కోసం విడుదల చేస్తున్నట్లు చెప్పారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించిన మంత్రి, ప్రజల సమస్యల పరిష్కారంలో వేగంగా స్పందించే విధానాన్నే ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. మండలాల వారీగా అర్హులను గుర్తించి సహాయం అందిస్తున్నామని తెలిపారు.

# రూ.136 కోట్లతో స్వచ్ఛమైన త్రాగునీటి పథకం

**బాబా ఆశీస్సులతో పుట్టపర్తికి భారీ పరిశ్రమలు -రూ.51400 కోట్లతో రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్లాంట్**

**శాశ్వత త్రాగునీటి పథకానికి శంకుస్థాపన చేసిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**









**శ్రీ సత్యసాయి ప్రతినిధి, మే 22,(రిపబ్లిక్ న్యూస్):**
పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పుట్టపర్తికి స్వర్ణయుగం ప్రారంభమైందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీకి సుమారు 2 లక్షల జనాభాకు సరిపడే శాశ్వత సమగ్ర త్రాగునీటి పథకానికి కొత్తచెరువు సమీపంలోని బుక్కపట్నం చెరువులో శుక్రవారం జిందాల్ వాటర్ వర్క్స్ ఇన్ఫ్రాప్రా లిమిటెడ్ ఏరియా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏషియన్ ఇన్ఫ్రాక్ట్ స్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ వారి సహకారంతో పుట్టపర్తి మున్సిపాలిటీకి మంజూరైన 136.26 సమగ్ర త్రాగునీటి పథకానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ పనులు ప్రారంభించారు.

**ఎన్నో ఏళ్ల త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి మున్సిపాలిటీ ప్రజలకు శాశ్వతంగా త్రాగునీటి పథకానికి రూ.136.26 కోట్లతో సమగ్ర త్రాగినీటి పథకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. 2018 19లో అప్పటి ఎమ్మెల్యే మంత్రి అయిన పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక కృషితో సహకారంతో 100.38 కోట్లతో ఈ ప్రాజెక్టు మంజూరైనప్పటికీ ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం దీన్ని గాలికి వదిలేయడంతో ప్రాజెక్టు రద్దు అయిందన్నారు. తిరిగి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పుట్టపర్తి మున్సిపాలిటీ ప్రజల దాహార్తిని తీర్చడానికి సమగ్ర త్రాగునీటి పథకం ద్వారా 136. 26 కోట్లతో పనులు ప్రారంభించుకోవడం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్ పనులను జిందాల్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టి వచ్చే రెండేళ్లలో 2028 మే నాటికి పూర్తి చేస్తారని తెలిపారు.
పుట్టపర్తి ప్రజల ఎన్నో ఏళ్ల త్రాగునీటి సమస్యకు ఈ పథకం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.అలాగే బాబా ఆశీస్సులతో పుట్టపర్తి నియోజకవర్గానికి భారీ పరిశ్రమలు వస్తుండడం ఆనందకర విషయమన్నారు. ఆమడగూరు మండలంలో రూ.51,400 కోట్లతో ఏర్పాటు కానున్న రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో పుట్టపర్తి నియోజకవర్గం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రజలకు మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, తాగునీరు, పారిశ్రామిక అభివృద్ధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.పుట్టపర్తి మున్సిపాలిటీకి శాశ్వత త్రాగునీరు సరఫరా అయ్యేలా మంచి ప్రాజెక్ట్ మంజూరు కావడం అభినందనీయం అన్నారు. ముఖ్యంగా నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలని నీటిని వృథా చేయవద్దని సూచించారు. ఇక్కడ ఉన్న పుట్టపర్తిలోని బుక్కపట్నం చెరువును,కొండలను చూస్తుంటే పాపికొండలు తలపించేలా ఉన్నాయని తెలిపారు. సత్య సాయి జిల్లాలోనీ అన్ని మున్సిపాల్టీల్లోని ప్రజల దాహార్తిని తీర్చడానికి సుమారు రూ.1000 కోట్లతో త్రాగునీటి పథకాలు మంజూరైనట్లు తెలిపారు. పుట్టపర్తి చిత్రావతి నదిలో కలుషితమవుతున్న మురుగునీరు నిర్మూలనకు రూ.1కోటి 50 లక్షలతో ఎస్టిపి ద్వారా చర్యలు తీసుకొని అడ్డుకట్ట వేస్తామన్నారు.


**అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందిస్తాం**

మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ సత్య సాయి బాబా నడయాడిన పవిత్ర పుణ్యక్షేత్రమైన పుట్టపర్తికి రూ.136 కోట్లతో త్రాగునీటి ప్రాజెక్టు మంజూరు కావడం అభినందనీయం అన్నారు.పుట్టపర్తిలో 11700 కుళాయి కనెక్షన్లు కు ప్రతి ఇంటికి స్వచ్ఛ నీరు అందించాలని ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేసినట్లు తెలిపారు. అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు . 2014- 2019 వరకు కొనసాగిన టిడిపి ప్రభుత్వంలో 100 కోట్లతో పుట్టపర్తికి త్రాగునీటి పథకాన్ని తీసుకొస్తే గత ప్రభుత్వ హయాంలో వాటిని ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఇలాంటి భారీ ప్రాజెక్టు రద్దు కావడం చాలా బాధాకరమన్నారు. తిరిగి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సహకారంతో సుమారు 136.26 కోట్లతో ఈ ప్రాజెక్టు పునరుద్ధరణ చేసి ఈరోజు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారని అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గానికి సత్యసాయి బాబా ఆశీస్సులతో ఎన్నో భారీ ప్రాజెక్టులు ఏర్పాటవుతున్నాయని ఇక్కడ ఉన్న వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కావడం ఎంతో గర్వకారణమన్నారు. అందుకు ప్రధానీ నరేంద్ర మోడీకి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ కు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిందాల్ కంపెనీ ప్రతినిధులు శ్రీనివాసులు హర్షవర్ధన్ త్రిపాటి మనీ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్, పబ్లిక్ హెల్త్ డి ఈ నరసింహమూర్తి ఈ సూర్యనారాయణ, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ,కాళహస్తి ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు సాలెక్క గారి శ్రీనివాసులు , గంగాధర్ నాయుడు ,చెరువు సంఘం అధ్యక్షులు నవీన్ , సహకార సొసైటీ అధ్యక్షులు హరిప్రసాద్ , రాజు, హర్ష కిరణ్ కుమార్ , మాధవి రాధ , తాహసిల్దార్ ఎంపీడీవో ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గోమాత వైభవంపై చాగంటి ప్రవచనం

**కర్నూలులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్ , మాజీ రాజ్యసభ సభ్యుడు టిజి వెంకటేష్**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 22)**
కర్నూలు నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల మైదానంలో గోమాత వైభవంపై ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర రావు నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తి వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ౨+ భారత్ తో పాటు మాజీ రాజ్యసభ సభ్యుడు టిజి వెంకటేష్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.
కార్యక్రమానికి ముందు గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం "గో ప్రాధాన్యత.. గోసేవావశ్యకత" పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రతులను చాగంటి కోటేశ్వరరావు టీజీ వెంకటేష్, టీజీ భరత్‌లకు అందజేశారు.
ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ, "చాగంటి వంటి మహానుభావులు సమాజంలో ఉండడం మన అదృష్టం. ఆయన అనుకుంటే అపార సంపద సంపాదించవచ్చు. కానీ ప్రజలకు ధర్మబోధ చేయడమే ఆయన ధ్యేయం" అని పేర్కొన్నారు. చాగంటి కోటేశ్వరరావు చేతుల మీదుగా సన్మానం పొందడం తమ పూర్వజన్మ సుకృతమని అన్నారు.
మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ, "చాగంటి కోటేశ్వరరావు కర్నూలుకు రావడం మా అదృష్టం. గోమాత గొప్పతనాన్ని ఆయన ప్రవచనాల్లో తెలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది" అన్నారు. రాజకీయాల్లో ఎలా ఉండాలో కూడా చాగంటి ప్రవచనాలు మార్గనిర్దేశం చేస్తాయని చెప్పారు. కర్నూలులోని గాయత్రి గోశాలలో 1200కిపైగా ఆవులు ఉన్నాయని, గోసేవపై పుస్తక రూపంలో అవగాహన కల్పించడం సమాజానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు.
చాగంటి కోటేశ్వరరావు తన ప్రవచనంలో గోసేవ ప్రాముఖ్యతను వివరించారు. "గోదానం కన్నా గొప్ప దానం లేదు. ప్రతి రోజూ గోమాత సేవ చేయాలి. గోవులను స్మరిస్తే మనసుకు ఉత్సాహం కలుగుతుంది. గోవులు సంచరించిన ప్రదేశం అత్యంత పవిత్రమైనది" అని ఆయన అన్నారు.
ఈ కార్యక్రమంలో గాయత్రి గోశాల, గాయత్రి గోసేవ సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.










# రాత్రివేళల్లో విజిబుల్ పోలీసింగ్ కొనసాగింపు

**రోడ్డు ప్రమాదాల నివారణకు "స్టాప్ - వాష్ అండ్ గో" కార్యక్రమం**







**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 22)**
జిల్లాలో రాత్రివేళల్లో ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీసులు విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయి.కర్నూలు టూ టౌన్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, రద్దీ ప్రాంతాలు మరియు అనుమానాస్పద ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేపట్టారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి.జాతీయ రహదారులపై ప్రయాణిస్తున్న లారీలు, బస్సులు మరియు ఇతర వాహనాలను ఆపి డ్రైవర్లకు కొంతసేపు విశ్రాంతి కల్పిస్తూ, నీటితో ముఖం కడిగించి అప్రమత్తం చేస్తున్నారు. అలసటతో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికంగా ఉండటంతో "స్టాప్ – వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.అతి వేగంగా వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, అధిక ప్రయాణికులతో వాహనాలు నడిపే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్'..

## కర్నూలులో వినాయక ఘాట్ వద్ద ఘన ప్రారంభం

**నాలుగు వారాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమానికి శ్రీకారం**

**మంత్రి టీజీ భరత్ గుప్తా, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి హాజరు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 22)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని నగరంలోని వినాయక ఘాట్ వద్ద ఘనంగా ప్రారంభించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తా, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి హాజరుకానున్నట్లు వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా 123 పట్టణ స్థానిక సంస్థల్లో అమలు కానున్న ఈ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ద్వారా నగరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడం, ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన పెంపొందించడం, చెత్త నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.నాలుగు వారాల పాటు దశలవారీగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్న కమిషనర్, మొదటి వారంలో రోడ్లు, జంక్షన్లు, రెడ్ & యెల్లో స్పాట్స్ శుభ్రపరిచే పనులు చేపడతామని తెలిపారు. రెండో వారంలో కాలువలు, డ్రైన్లు, వీధుల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. మూడో వారంలో వ్యర్థాల వర్గీకరణపై అవగాహన కార్యక్రమాలు, మార్కెట్లు మరియు వాణిజ్య ప్రాంతాల పరిశుభ్రతపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. నాలుగో వారంలో ప్రజా మరుగుదొడ్లు, చెత్త నిర్వహణ వ్యవస్థల మెరుగుదలపై చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన మేరకు "ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛతలో నెంబర్-1గా నిలబెట్టడమే లక్ష్యంగా" ఈ కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. నగర ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## చెంచు గుడాలలో మౌలిక వసతులు కల్పించండి

**:- డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు**



**పాములపాడు మే 22 రిపబ్లిక్ న్యూస్:-**చెంచుగూడాలలో మౌలిక వసతులు కల్పించాలని మరియు ప్రధానమంత్రి జన జీవన యోజన క్రింద మంజూరైన చెంచు గూడాలలో ఇండ్లు నాణ్యత లేదని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు ఆరోపించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాములపాడు మండలంలోని, వేంపెంట, నల్లకాలువ, ఎర్రమఠం చెంచుగూడెంలో పర్యటిస్తూ సంవత్సర క్రితం వేంపెంట లో దాదాపు 20మందికి ప్రధానమంత్రి జనజీవన యోజన కింద గృహాలు మంజూరు అయితే వాటిలో కొంతమంది ఇల్లు బేస్మెంట్ నలుగురికి బేస్మెంట్ బిల్లు అయిందని ఇంతవరకు మిగతా ఇల్లు ఎందుకు కట్టడం లేదో తర్డు పార్టీ సమాధానం చెప్పాలని అంత జరుగుతున్న హౌసింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. నల్లకాలువ, ఎర్రమఠం చెంచుగూడెంలో లెంటల్ లెవెల్ అయిన ఇల్లు ఇప్పటికే పగుళ్లు ఏర్పడ్డాయని హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం వీడడం లేదని చెంచుల ఇల్లు నాణ్యత లేకుండా కడుతున్న చెంచులే కదా ఎవరు ప్రశ్నించరని ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు వ్యవహరిస్తున్నారని వెంటనే హౌసింగ్ ఏఈ లపై, డిఈ లపై చర్యలు తీసుకునే విధంగా రేపు జరగబోయే జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు.

# టీడీపీ నేత మాసినేని రామయ్యకు ఘన నివాళి

**పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పూల నాగరాజు, పయ్యావుల శ్రీనివాసులు**

**అనంతపురం క్రైమ్, మే 22,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాసినేని గ్రాండ్ హోటల్ యజమాని మాసినేని రామయ్య మృతిపై టీడీపీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన పార్థివ దేహానికి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, మాజీ మంత్రి పయ్యావుల శ్రీనివాసులు శుక్రవారం నివాళులర్పించారు. నగరంలోని రామయ్య నివాసానికి చేరుకున్న నాయకులు పార్థివ దేహంపై పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

**పార్టీ అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయం**

ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పట్ల మాసినేని రామయ్యకు అపారమైన అభిమానం ఉందన్నారు. పార్టీ కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ చురుకుగా పాల్గొంటూ నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. రామయ్య పార్టీ అభివృద్ధికి అందించిన



సేవలు చిరస్మరణీయమని పేర్కొన్న ఆయన, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. రామయ్య ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప, ఏపీ రాష్ట్ర కార్యదర్శి సిమెంట్ పోలన్న, మాజీ రాష్ట్ర కార్యదర్శులు ఆలం నరసానాయుడు, రాయల్ మురళి, పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు పెరువల్లి కృష్ణకుమార్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత ఉండాలి

**కలెక్టర్ డా. ఏ.సిరి**

**"ఒక నెలఒక నియోజకవర్గం4 పర్యటనలు" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశం**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 22)**

ప్రతి నియోజకవర్గంలో నిర్వహిస్తున్న "ఒక నెలఒక నియోజకవర్గం4 పర్యటనలు" కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి స్వీకరించే ప్రతి అర్జీపై స్పష్టమైన చర్యలు తీసుకుని, పరిష్కార ప్రక్రియను పారదర్శకంగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పాణ్యం నియోజకవర్గం రెండవ విడత పర్యటనలో భాగంగా స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ డా. ఏ.సిరి, గౌరు చరిత, నూరుల్ ఖమర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి విడతలో వచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యలకు సంబంధించిన



ఆర్డర్లు ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్థిక అంశాలకు సంబంధించిన వినతులపై అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని, అమలు సాధ్యం కాని అర్జీలకు "నాట్ ఫీజిబుల్"గా స్పష్టమైన కారణాలతో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. వచ్చే మూడవ విడత పర్యటనలో రెండవ విడతలో వచ్చిన అర్జీల పరిష్కారానికి సంబంధించిన ఆర్డర్లు, ఎండార్స్‌మెంట్‌లు తప్పనిసరిగా తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తమ అర్జీల పురోగతిని తెలుసుకునే విధంగా డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ముఖ్యంగా బ్రిడ్జిలు, రోడ్లు వంటి ఆర్థిక సంబంధిత అభ్యర్థనలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నామో స్పష్టంగా తెలియజేస్తే ప్రజలకు అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.

పరిష్కరించలేని అర్జీల విషయంలో కూడా స్పష్టమైన కారణాలు తెలియజేయాలని, "పని సాధ్యం కాదు", "ప్రభుత్వానికి పంపించాం" వంటి వివరాలు అందించడం ద్వారా అర్జీదారులు ఇబ్బందులకు గురికాకుండా ఉంటారని కలెక్టర్ తెలిపారు. ప్రతి అర్జీదారుకు స్పష్టమైన సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నాల్గవ విడత పర్యటనలో గత మూడు విడతలలో పరిష్కరించిన గ్రీవెన్సెస్ వివరాలను ప్రదర్శించడంతో పాటు, పరిష్కరించలేని అర్జీల కారణాలను కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. అర్జీలకు సంబంధించిన అక్నాలెడ్జ్‌మెంట్ కాపీలను అధికారులు భద్రపరచుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, అదనపు కమిషనర్ కృష్ణ, హౌసింగ్ పీడీ చిరంజీవి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ విజయ, డీఎంహెచ్ఓ డా. కామేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ' మీ సమస్య.. మా బాధ్యత'

**బీజేపీ జనతా వారధిలో ప్రజల అర్జీల స్వీకరణ**

**అనంతపురం సంక్షేమం, మే 22,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన "జనతా వారధి" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెల్స్ కన్వీనర్ కే. చిరంజీవిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను స్వీకరించిన ఆయన, సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే పీజీఆర్ఎస్‌లో జనతా వారధి ద్వారా వచ్చిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు.




ఈ సందర్భంగా చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనతా వారధి కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తోందన్నారు. "మీ సమస్య.. మా బాధ్యత " అనే నినాదంతో ప్రతి శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ప్రజల సమస్యలు విని, ఆయా శాఖల అధికారులను కలిసి పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనతా వారధి జిల్లా కన్వీనర్ యల్. నాగేంద్ర, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శులు గణేష్, నేత్రవతి, నరేంద్ర, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌దాస్, కాటమయ్య, ఓబులేసు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# "పేదల ఆకలి తీర్చడమే మా ప్రభుత్వ లక్ష్యం"

**అన్నా క్యాంటీన్‌పై ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి టీజీ భరత్ గుప్తా**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 22)**కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌ను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న వృద్ధులు, మహిళలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో మంత్రి మాట్లాడారు. భోజనం నాణ్యత, రుచి, సదుపాయాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని పలుమార్లు ప్రశ్నించారు. అనంతరం క్యాంటీన్ పరిసరాలను పరిశీలించి, స్వయంగా ప్రజలకు భోజనం వడ్డించారు. తనిఖీ అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పేద ప్రజలు, రోగుల బంధువులు పెద్ద సంఖ్యలో వస్తుంటారని, వారికి అన్నా క్యాంటీన్ ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. "ఆహారం చాలా బాగుందని ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోంది. ఎవరిని అడిగినా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు" అని తెలిపారు. గత ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను మూసివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించిన మంత్రి, ప్రస్తుత ప్రభుత్వం పేదల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లను సమర్థంగా నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న మంచి కార్యక్రమాలకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తుండటాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు.



# అమ్మ ఒడిని మరిపిస్తున్న బాలసదనం

**బాలల హక్కుల కమీషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసమూర్తి, వెంకట పద్మలత**

**అనాధ పిల్లల క్రమశిక్షణ, చదువులో వారి చురుకుదనం, వారిలోని నైపుణ్యం చూస్తే ముచ్చటేస్తోంది**

**అనాధ పిల్లలు ఎక్కడున్నా గుర్తించి.. వారికి మంచి భవిష్యత్తు ఇవ్వండి**

**బాలల హక్కులను కాపాడటమే అందరి లక్ష్యం కావాలని పిలుపు**

**సూపరింటెండెంట్ రఫీమున్నీసా, సిబ్బందిని అభినందించిన కమీషన్ సభ్యులు**



**అనంతపురం సంక్షేమం, మే 22,(రిపబ్లిక్ న్యూస్):** పచ్చని చెట్లు.. సువిశాలమైన గదులు.. చక్కటి వాతావరణం.. ఇవన్నీ చూస్తుంటే ఇది బాలసదనమా లేక అమ్మ ఒడినా అనిపిస్తోంది. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న ఆడపిల్లల క్రమశిక్షణ.. చదువులో వారి చురుకుదనం.. వారిలోని నైపుణ్యం.. పెద్దాయ్యాక తామేం కావాలనుకుంటున్నది.. భవిష్యత్ లక్ష్యం ఏమిటనే విషయాల గురించి పిల్లలు చెప్పిన మాటలు మా హృదయాలను తాకాయి. వారి మాటలు మమ్మల్ని ఆలోచనలో పడేశాయి. అమ్మా, నాన్న లేని అనాధలం అనే విషయాన్ని మరచిపోయి.. ఇంతటి చక్కటి వాతావరణంలో ఆ పిల్లలు తమ భవిష్యత్ ను అందంగా తీర్చిదిద్దుకుంటున్న తీరు చూస్తే ముచ్చటేస్తోందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసమూర్తి, వెంకట పద్మలత అన్నారు. అందుకు కృషి చేస్తున్న బాలసదనం సూపరింటెండెంట్ ఖాజీ రఫీమున్నీసా, సిబ్బందిని వారు అభినందించారు. సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ మేడా రామలక్ష్మితో కలిసి అనంతపురం బుడ్డప్పనగర్ లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనాన్ని శుక్రవారం వారు సందర్శించారు. వారి వెంట ఐసీడీఎస్ పీడీ శశికళ, డీఎంసీ శ్రీదేవి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల డీసీపీఓలు మంజునాథ్, మహేశ్, సీడబ్ల్యూసీ సభ్యులు కామేశ్వరి, ఓబుళపతి ఉన్నారు. ముందుగా బాలసదనం సందర్శించారు. వారికి బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న అమ్మాయిలు తమ స్వయంగా రూపొందించిన రంగుల కాగితాల బొకె అందించి స్వాగతం పలికారు. ఇంత అందంగా ఉంది. ఎవరు తయారు చేశారని ప్రశ్నించిన సభ్యులకు... తామే తయారు చేశామని బాలికలు బదులివ్వడంతో వారిని శభాష్.. ఇంత అందంగా ఎలా తయారు చేయగలిగారంటూ మెచ్చుకున్నారు. ఆ తరువాత హాల్ లో విద్యార్థినులతో సమావేశమయ్యారు. ఎంత మంది పిల్లలు ఉన్నారు, ఎవరెవరు ఏం చదువుతున్నారు, భవిష్యత్ లో మీరేం కావాలనుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. వారిచ్చిన సమాధానాలు విని అతిథులు ఆశ్చర్యపోయారు. అమ్మానాన్న లేరనే దిగులు లేకుండా.. ఇప్పటి నుంచి ఇదే క్రమశిక్షణ, పట్టుదలతో చదవండి. భవిష్యత్లో మీరు మంచి స్థాయికి ఎదుగుతారని దీవించారు. ఆ తరువాత వారిలోని ప్రతిభా పాటవాలను తెలుసుకునే క్రమంలో పాటలు ఎవరు బాగా పాడగలరు డ్యాన్స్ ఎవరు బాగా చేస్తారని అడిగి మరీ పాటలు పాడించుకొని, డ్యాన్స్ చేయించి ఆనందం వ్యక్తం చేశారు. మీలో ఇన్ని రకాల నైపుణ్యాలు దాగి ఉన్నాయని కితాబునిచ్చారు. మీలాంటి అమ్మానాన్న లేని పిల్లలకు బంగారు భవిష్యత్ ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఆశయమని చెబుతూ.. అందుకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ తరువాత కార్యాలయం, రికార్డులు, వంట గది, లైబ్రరీ, డైనింగ్ హాల్ చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఇంత అందంగా, పరిశుభ్రంగా ఉంచడం చూస్తే మనస్సుకు హాయినిస్తోందన్నారు. అనంతరం శిశుగృహను సందర్శించారు. అక్కడ ఎంత మంది పిల్లలు ఉన్నారు, వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది,




రెగ్యులర్ గా పీడియాట్రిక్ వైద్యుల పర్యవేక్షణ ఉందా లేదా అని ఆరా తీశారు. గతంలో ఇక్కడ జరిగిన పరిణామాల నేపథ్యంలో జాగ్రత్తగా వ్యవహరించాలని శిశుగృహ మేనేజర్ భాగ్యమ్మ, సిబ్బందికి సూచించారు. బాలసదనం అకౌంటెంట్ ఫాతిమా, చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, ఐసీ వెంకటేశ్వరి, ఎన్ఐసీ చంద్రకళ, కౌన్సెలర్ వెంకట్, సూపర్వైజర్ నవీన్, చైల్డైన్ కౌన్సెలర్ సురేశ్, కేస్ వర్కర్లు నిర్మల, సుహాసిని, ఇర్ఫాన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆందోల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసును అందుబాటులోకి తేవాలి

## ముళ్ల పొదలతో ఎలాంటి రక్షణ లేకుండా వృధాగా ఉన్న క్యాంప్ కార్యాలయం

**ఆందోల్ ప్రతినిధి మే 22( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

ఆందోల్ నియోజకవర్గం పరిధిలో గత ప్రభుత్వంలో నిర్మించిన ప్రతి అసెంబ్లీకి సంబంధించి ప్రతి ఎమ్మెల్యే అందుబాటులో ఉండి నేరుగా ఎమ్మెల్యే వద్దకు వచ్చి తమ సమస్యలపై వివరించుకోవడానికి సానుకూలంగా ఉంటుందని సదుద్దేశంతో గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు తీసుకున్నటువంటి నిర్ణయం ప్రతి ఎమ్మెల్యేకు తన నియోజకవర్గంలో అద్దె భవనాల్లో ప్రైవేటు భవనాల్లో ఎమ్మెల్యేలు ఉండకూడదు అనే ఉద్దేశంతో వారికంటూ ఒక ప్రభుత్వ సొంత భవనం ఉండాలని ప్రతి ఎమ్మెల్యేకు తన నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అని నామకరణం చేసి లక్షల డబ్బులు ఖర్చు చేసి భవనాలు నిర్మించడం జరిగింది దానితో వారంలో రెండు రోజులు మూడు రోజులు స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉండడంతో ప్రతి సమస్య గురించి ఎమ్మెల్యేను కలవాలంటే హైదరాబాద్ పోవాల్సిన పరిస్థితి వస్తుండే అలాంటి సమస్యను నేరుగా తన నియోజకవర్గంలో



ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు వెళ్లి సమస్యను వివరించుకునే సదుపాయం కల్పించిన గొప్ప వ్యక్తిగా నిలిచారు అదే సందర్భంగా ఆందోల్ అసెంబ్లీలో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గత ఎమ్మెల్యేలు బాబు మోహన్ చంటి క్రాంతి కిరణ్ ఇక్కడున్నటువంటి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉండేవారని ప్రజల వినికిడి ఇప్పుడు ఆ యొక్క కార్యాలయం ఈ ప్రాంతంనుంచి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న దామోదర్ రాజనర్సింహ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వైపు చూడకపోవడం దాని వెనకాల ఉన్న అంతరాయం ఏంటి అలాగే చూసుకుంటే ప్రభుత్వ ధనంతో కట్టినటువంటి భవనాన్ని ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో రక్షణ లేకుండా ఒక పాడుబడ్డ బంగ్లా గా ఎవరు వస్తారో తెలియదు ఎవరు పోతారు తెలువని పరిస్థితిలో క్యాంపు కార్యాలయం ఉండడం నియోజకవర్గం ప్రజలు ఏ పాపం చేశారు ఏ విషయానికైనా హైదరాబాదు సంగారెడ్డి ప్రాంతాలకు వెళ్లాల్సిందేనా గత ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండేవారని ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే మినిస్టర్ ఎప్పుడు ఎక్కడుంటున్నారు తెలియని పరిస్థితిగా మారిందని గుసగుసలు వినిపిస్తున్నాయి ఇప్పటికైనా పై అధికారులు స్పందించి ప్రజాధనంతో నిర్మించిన క్యాంపు కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి కార్యాలయాన్ని రక్షణగా ఉంచుకొని మన బాధ్యత గొప్పగా చాటుకునే విధంగా ఉండాలని నియోజకవర్గంలో ఉన్న ప్రజలు కోరుకుంటున్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల గోష కనపడదా

## -మార్కెట్ కమిటీ చైర్మన్ రైతుల ఘోష కనబడుట లేదా.



**ఆందోల్ ప్రతినిధి మే 22( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కుమ్మరిగూడెం డబుల్ బెడ్ రూమ్ దగ్గర ఉన్న గ్రౌండ్లో రైతుల వరి ధాన్యాన్ని ఆరపెట్టడం తప్ప కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. గత 15 రోజులుగా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయక రైతుల గోష రాత్రి పగలు వారి ధాన్యాల చుట్టూ నిద్రిస్తున్నారు. రైతే రాజన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈరోజు రైతుల గోషా కనబడుట లేదా అని రైతులు వాపోతున్నారు.

# హోరాహోరీగా రాతిదూలం పోటీలు

## రాతి దూలాల పోటీలకు విరాళాలు అందజేసిన

## విజయ్ భరత్ రెడ్డి, - సాయి ఈశ్వర్ రెడ్డి.





**అనంతపురం / పెద్దవడుగూరు సంక్షేమం, మే 22,(రిపబ్లిక్ న్యూస్):**

మండలంలోని ఆవులంపల్లి గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా రాతిదూలాల పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. అందులో భాగంగా గ్రామ యువత భారీ సంఖ్యలో పాల్గొనడంతో ఒంగోలు జాతి వృషభాలు రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. గ్రామస్థులు పెద్దఎత్తున హాజరై పోటీలను ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా గుత్తి మండలం తురకపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విజయ్ భరత్ రెడ్డి కుమారుడు సాయి ఈశ్వర్ రెడ్డి, రాతి దూలాల పోటీల కు రూ. 10 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. వారి సేవాభావాన్ని అభినందించిన ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కె. విజయ్ భరత్ రెడ్డి, కె. సాయి ఈశ్వర్ రెడ్డి, బి. నాగిరెడ్డి, కె. నాగేశ్వరరెడ్డి, డి. హనుమంతరెడ్డి, కె. హనుమంతరెడ్డి, పి. జయపాల్ రెడ్డి, బి. నారాయణ, జె. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన బహుజన ప్రజాఫ్రంట్ అధ్యక్షులు మీ సామ్రాట్ గోవర్ధన్

**ఆందోల్‌ప్రతినిధి మే 22 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఆరు గ్యారెంటీలు అన్ని అమలు చేయాలని బహుజన ప్రజా ఫ్రంట్ అధ్యక్షులు సామ్రాట్ గోవర్ధన్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన గౌరవ శ్రీ రేవంత్ రెడ్డి కి బహిరంగ లేఖ రాశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బహిరంగ లేఖలో సామ్రాట్ గోవర్ధన్ ప్రస్తావిస్తూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం పేరిట ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఇందిరమ్మ రాజ్యం తీసుకువస్తామని చెప్పిన హామీలు అన్ని తు తు మంత్రంగా అమలు చేస్తూ కాలమెల్లదీస్తున్నారని ఆయన వెల్లడించారు ప్రజా పాలన పేరు చెప్పి దోపిడి పాలన కొనసాగిస్తున్నారని దొరల పాలన అంతం చేస్తామని చెప్పి దొంగల పాలన కొనసాగిస్తున్నారని ఆయన విమర్శించారు రైతులకు రైతుబంధు రైతు బీమా సక్రమంగా అమలు కావడం లేదని పండించిన దాన్యం సరైన సమయంలో కొనుగోలు చేయకుండా కాలయాపన



చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని ఆయన మండిపడ్డారు వికలాంగుల వితంతువులవృద్ధులకు పెన్షన్లు పెంచుతామని గొప్పలు చెప్పి మూడు సంవత్సరాలు దగ్గర పడుతున్న ఇప్పటికి కూడా నెరవేర్చలేరని గుర్తు చేశారు అలాగే ప్రతి మహిళకు 2500 రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటికి కూడా ఆమెని అమలు పరచకపోవడం చాలా విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు ఇందిరమ్మ ఇండ్లు గ్రామాలో పట్టణాల్లో అర్హులైన పేదలకు ఇవ్వకుండా తమకు అనుకూలమైన వారికి పైరవీ దారులకు లంచాలు తీసుకొని మంజూరు చేస్తూ బిల్లులు సక్రమంగా ఇవ్వకుండా లబ్ధిదారులను పీడిస్తూ చాలా గ్రామాల్లో కట్టడాలు మధ్యలోనే ఆగిపోయాయి ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఉచిత బస్సు ప్రయాణం ఆడవాళ్లకు ఫ్రీ పెట్టి మగవాళ్ళత డబుల్ వసూలు చేస్తు మేము మహిళలకు ఫ్రీ బస్సు పెట్టినామని గొప్పలు చెప్పుకోవడం తప్ప దానివల్ల ఎలాంటి ప్రయోజనం లేదని వెంటనే ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఆరు గ్యారంటీలు మహిళలకు 2500 లాంటి పథకాలను తక్షణమే అమలు చేయాలని లేని పక్షంలో ప్రజలను పెద్ద ఎత్తున కూడగట్టి పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ద్వారా ముఖ్యమంత్రి కి బహిరంగ లేక పంపడం జరిగింది .

# ప్రతి ఒక్కరికి బ్యాంక్ సేవలు అందాలి,

## ఎల్ డి యం రవికుమార్.

**రైల్వే కోడూరు మే 22 రిపబ్లిక్ న్యూస్.**




రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని బ్యాంకు అధికారులతో జాయింట్ మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగినది, లీడ్ బ్యాంకు మేనేజర్ గుంటూరు రవికుమార్ ఆధ్వర్యంలో బ్యాంకర్ల సమావేశం శుక్రవారం ఏర్పాటు చేయడం జరిగింది. వెలుగు ఆఫీస్ లో జరిగిన ఈ సమావేశానికి రైల్వే కోడూర్,ఓబులవారిపల్లి, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు మండలాలకు సంబంధించిన బ్యాంక్ అధికారులు, డిఆర్డిఏ వెలుగు సమాఖ్య అధికారుల తో సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎల్డియం రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి ఇవ్వాలని తెలిపారు. ఇందులో భాగంగా సీఎం సూర్యఘర్ పథకం కింద నమోదు చేసుకున్న వారికి సపోర్ట్ చేయాలన్నారు. వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ సబ్సిడీ రుణాలను అర్హులైన వారికి కేటాయించాలని బ్యాంక్ సిబ్బందికి తెలిపారు. పీఎం ఈజిపి, పీఎం ఎఫ్ఎంఈ, స్వయం శక్తి, ముద్ర రుణాలు విధిగా అమలు చేయాలని సూచించారు. రైతులకు సంబంధించిన క్రాఫ్ ఇన్సూరెన్స్ తప్పక నమోదు చేయాలని తెలిపారు. అలాగే డిఆర్డిఏ ఏపీడి, డీపీఎంలు మాట్లాడుతూ మహిళా సంఘాలకు సంబంధించిన రుణాలు ఇవ్వడం, రికవరీ చేయడంలో బాధ్యతగా పనిచేయాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆర్సెట్టి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ డి ప్రభావతి, బ్యాంకు లింకేజీ డిపిఎం వనజాక్షి, ఆర్సెట్టి మేనేజర్, ఏపీఎం వసుంధర అలాగే నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ఏపిఎంలు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

# కారు స్కూటర్ ఢీ

## : ఒకరికి గాయాలు



**చౌడేపల్లి ప్రతినిధి మే 22 రిపబ్లిక్ న్యూస్**

కారు స్కూటర్ ఢీకొని ఒకరు గాయపడిన సంఘటన శుక్రవారం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది చౌడేపల్లి- పుంగనూరు ప్రధాన రహదారిలో తిరుపతి నుంచి పుంగనూరు కి వెళ్తున్న కారు పుంగనూరు నుంచి చౌడేపల్లి వైపు వస్తున్న స్కూటర్లు పుదీపట్ల కోళ్ల ఫారం వద్ద ఢీకొన్నాయి ఈ ప్రమాదంలో పంచలింగాల కొత్తూరుకు చెందిన సుబ్రహ్మణ్యం 25 కాలుకు బలమైన గాయమైంది గాయపడ్డ అతన్ని 108 పైలెట్ చిట్టిబాబు ఈఎంటి హరిబాబు మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ మేరకు చౌడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నన్నూరు లొద్ది పల్లె గ్రామాల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడు



**ఓర్వకల్లు ప్రతినిధి, మే 22(రిపబ్లిక్ న్యూస్)**

పై చిత్రం లో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఓర్వకల్లు మండలం,నన్నూరు, లొద్దిపల్లి గ్రామాల మధ్యలో రోడ్డు పక్కన చనిపోయి పడి ఉన్నాడు. ఇతడి గురించి ఎవరికైనా సమాచారం తెలిసిన యెడల ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ SI U. సునీల్ కుమార్ -ఫోన్ నంబర్ 9121101067 కు తెలుపగలరు.

# కాల్వ గ్రామంలో బడి పిలుస్తుంది కార్యక్రమం

## మండలవిద్యాశాఖ అధికారి జి ఓంకార్ యాదవ్

**ఓర్వకల్లు ప్రతినిధి, మే 22(రిపబ్లిక్ న్యూస్)**



శుక్రవారం రోజున ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామం నందు బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని, గ్రామంలో ర్యాలీ మరియు మానవహారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జీ. ఓంకార్ యాదవ్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రఘు పవన్ కుమార్, ఆసియా నస్రీన్,మరియు ఉపాధ్యాయులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వీజూా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అనగా మధ్యాహ్నం భోజనం పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, బ్యాగ్, బెల్ట్, నోటు పుస్తకాలు మొదలగునవి ఉచితంగా అందజేస్తున్నారని తెలియజేయడం జరిగింది

# మర్యాదపూర్వకంగా మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన

## రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ

**దేవనకొండ , మే 22( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**

కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని జన్నగిరి గ్రామంలో గోల్డ్ మైన్ ప్రాంతాన్ని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. జన్నగిరి గోల్డ్ మైన్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. మంత్రి కొల్లు రవీంద్ర గోల్డ్ మైన్ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడి పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ హాజరై ప్రాంత అభివృద్ధిపై





మాట్లాడారు. తుగ్గలి నాగేంద్ర, పలువురు అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. గోల్డ్ మైన్ ప్రాంత అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుంటూ మంత్రి పలు సూచనలు చేశారు. ప్రాంత అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజలు మంత్రికి, నాయకులకు ఘన స్వాగతం పలికారు. జోన్నగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలని స్థానికులు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఈ పర్యటన స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది తెలియజేశారు.

# జూనియర్ హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు 25న

## జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారులకు ఆహ్వానం



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 22)**



జిల్లాస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 25వ తేదీ సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి తెలిపారు.

స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఈ ఎంపికలు జరగనున్నాయని పేర్కొన్నారు. జనవరి 1, 2006 లేదా ఆ తర్వాత జన్మించిన బాలురు, బాలికలు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపికైన జిల్లా జట్టు ఈ నెల 27 నుంచి 29 వరకు విజయనగరం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని వెల్లడించారు.

# యంత్రాల యజమానులపై ఆరోపణలు మానండి

## పునరావృతం అయితే చట్టపర చర్యలు తప్పవు.

**రైల్వే కోడూరు మే 22 రిపబ్లిక్ న్యూస్.**

ఓబులవారిపల్లి మండలం మంగంపేట లో జరిగిన భారీ లారీ వాహన యంత్రాల యజమానుల విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగినది ఈ సమావేశం కౌలూరి నవీన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలోశుక్రవారం నీరుంపల్లి టెంపుల్ సమావేశ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరిగినది, ముఖ్యఅతిథిగా కల్లా చలపతి పాల్గొన్నారు ఈ సందర్భంగాభారీ లారీ వాహన యంత్రాల యజమానుల సంఘం యజమాని చలపతి మాట్లాడుతూ గురువారం జరిగిన చలో ఏపిఎండిసి కార్యక్రమంలో లారీ యంత్రాల యజమానులను దొంగలుగా చిత్రీకరిస్తూ మాపై తీవ్ర నిందలు, విమర్శలు చేయడం,జరిగినదని ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని మాపై మోపిని నిందలు పునరావృతమైతే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని అందుకు పూర్తి బాధ్యులు మీరే అని ఈ సందర్భంగా లారీ యజమానుల సంఘం నాయకుడు హెచ్చరిక జారీ చేశారు , ఈ ప్రాంతంలో కార్మికులుమనుగడ సాగించాలంటే ఏపీఎండిసి సంస్థ బాగుండాలని అందరూ కోరుకుంటున్నామన్నారు సమస్త భాగుకోసం ఇల్లు వాకిళు భూములు అన్ని వదులుకున్నామని అలాంటి మాపై కొందరు నిందలు మోపడం తప్పుడు వ్యాఖ్యలు మాట్లాడడం సరికాదన్నారు, లారీ యంత్రాల యజమానులు తప్పులు చేసి ఉంటే చాలెంజ్ చేస్తున్న నిరూపించండి దేనికైనా సిద్ధమే ధైర్యం ఉంటే ముందుకు రండి నిరూపించండి అంతేగాని నోటికి వచ్చినట్లు నిందలు వేసి ఆరోపణ చేయడం సిగ్గుచేటు అన్నారు, ఎంప్రదా కంపెనీ సొంత లారీలు జెసిపిలు ప్రోక్లైన్స్ యంత్రాలు కొనుగోలు చేయనీయకుండా వాళ్లతో చర్చిలు జరిపి భూములు సర్వం కోల్పోయిన స్థానికులు లారీలు యంత్రాలు కొనుగోలు చేసి ఆ కంపెనీలో పని చేసుకుంటూ జీవన సాగిస్తున్నారని వారి మీద నిందలు తగవని అన్నారు



స్థానిక కుటుంబాల జీవనోపాధిని దెబ్బతీయాలనే కుట్ర జరుగుతోంది

నిరాధార ఆరోపణలపై చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు,

వాస్తవాలు తెలుసుకోకుండా కొందరు బయటి వ్యక్తులు కావాలనే ఒక ఎక్స్‌పోర్ట్ కంపెనీని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల ముందు అసత్య ప్రచారం చేస్తూ స్థానిక కుటుంబాల గౌరవాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించడం దురుద్దేశపూర్వక చర్య అని విమర్శించారు.

సంబంధిత ఎక్స్‌పోర్ట్ కంపెనీకి ఏపీఎండీసీ యార్డులో ఒక్క లోడింగ్ మిషన్ గానీ, ఒక్క టిప్పర్ లారీ గానీ సొంతంగా లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న మొత్తం 52 లోడింగ్ మిషన్లు, టిప్పర్ లారీలు పూర్తిగా మంగంపేట పరిసర గ్రామాలకు చెందిన స్థానిక యజమానులవేనని తెలిపారు.

ఒక కంపెనీని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, వాస్తవానికి స్థానిక మిషన్ యజమానులు, లారీ యజమానులు, డ్రైవర్లు, కార్మికులు, వారి కుటుంబాల జీవనోపాధిపై బురదజల్లే కుట్రగా బావిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వందలాది కుటుంబాలు మిషన్లు, లారీలు, రవాణా కార్యకలాపాల ద్వారానే జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. అలాంటి కుటుంబాలను అక్రమాలకు పాల్పడుతున్న వారిగా చిత్రీకరించడం అమానుషమని, బాధ్యతారాహిత్యమని తీవ్రంగా విమర్శించారు.

ఏపీఎండీసీ సంస్థ నిర్దేశించిన నిబంధనలు, అధికారుల పర్యవేక్షణ, సీసీ కెమెరాల నిఘా, భద్రతా సిబ్బంది సమక్షంలోనే మొత్తం లోడింగ్ ప్రక్రియ జరుగుతోందని వివరించారు. అధికార అనుమతులు, ఆర్డర్ల ప్రకారమే మిషన్లు పనిచేస్తున్నాయని, స్థానిక మిషన్, లారీ యజమానులు కేవలం అద్దె, రవాణా సేవలు మాత్రమే అందిస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కల్లా చలపతి, ఎంప్రద మేనేజర్ నవీన్‌రెడ్డి, లేబర్ మేనేజర్ సూర్యనారాయణ, కేశవులు, రవిశంకర్ రెడ్డి, శివ, శ్రీను, యానాది రెడ్డి, కేకే వెంకటేశ్వర్లు రెడ్డి, ఎస్ఎస్ రాజు, మిషన్ యజమానులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారుల్లోని ప్రతిభను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

**జిల్లా స్థాయి డ్రాగన్ బోట్ ఎంపిక పోటీలను ప్రారంభించిన డీఎస్డీవో భూపతిరావు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 22)**

క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్డీవో) భూపతిరావు ప్రశంసించారు. గురువారం కర్నూలు జిల్లా డ్రాగన్ బోట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గార్గేయపురం చెరువులో నిర్వహించిన జిల్లా స్థాయి డ్రాగన్ బోట్ ఎంపిక పోటీలను ఆయన రాష్ట్ర డ్రాగన్ బోట్ సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపతిరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్రీడలపై ఆసక్తి పెరుగుతుండటం ఆనందదాయకమని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి రాష్ట్రస్థాయి పోటీలకు పంపేందుకు ఇటువంటి ఎంపిక పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు కఠోర సాధనతో జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపేందుకు డీఎస్డీవో భూపతిరావు స్వయంగా డ్రాగన్ బోట్‌లో పాల్గొని పడవను నడిపారు. దీంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు లోకేష్, గంగాధర్, వ్యాయామ ఉపాధ్యాయులు దాసు, ప్రకాష్, సీనియర్ క్రీడాకారుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురాయి లోడింగ్ నిష్పక్షపాతముగా జరుగుతున్నది

**రైల్వే కోడూరు మే 22 రిపబ్లిక్ న్యూస్.**



ఓబులవారిపల్లి మండలంలోని మంగంపేట ఏపీఎండిసి పరిధిలో కొన్ని ముగ్గురాయి వ్యాపారాల ఎక్స్పోర్ట్ కంపెనీలకు అనుసంధానంగా మిషన్ లోడింగ్ వ్యవహారంలో విధులలో నిష్పరక్షపాతంగా. నిజాయితీగా పనులు చేపడుతున్నామని యజమానుల సంఘం నాయకులు గునిపాటి చిన్నరాయుడు శుక్రవారం పత్రికా ప్రకటనలో అన్నారు, శ్రీనిధి ఎంటర్ప్రైజెస్ కంపెనీ ద్వారా ఎటువంటి అవినీతి జరగకుండా నిబంధనల ప్రకారం విధులు చేపడుతున్నారని మా మిషనులు డ్రైవర్లు సూపర్వైజర్లు ఎక్కడ ఎటువంటి తప్పులు చేయలేదని చేయరని కొందరు . కార్మిక నాయకులు మిషన్ల యజమానులు దొంగలు అనడం సబబు కాదని ఆయన ఖండించారు,ఇకపై ఇలాంటి మాటలు మాట్లాడకుండా పునర్ ఆలోచన చేయాలని ఆయన సదరు విమర్శకులకు అభిప్రాయం వ్యక్తం చేశారు, బల్బ్ టెండర్ విషయంలో విమర్శలు చేయడం తగదని ఆ సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున ఎవరు మాట్లాడకూడదని కోర్టు న్యాయాన్ని నిర్ణయిస్తుందని అన్నారు

# దగ్ధమైన మామిడి తోట డ్రిప్పు, పైపులు. అనుమానం వ్యక్తం చేసిన రైతు.



**రైల్వే కోడూరు మే 22రిపబ్లిక్ న్యూస్.**



ఓబులవారిపల్లి మండలం బొమ్మ వరం రెవెన్యూ పొలాలలో దళిత నాయకులు సమతా సైనిక్ దళ్ అధ్యక్షులు చౌడవరం సుబ్బ నరసయ్య పంట పొలాలలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటిన్చడంతో డ్రిప్పులు మామిడి చెట్లు, టేక్ సీట్లు మంచినీరు పైపులైను అగ్నికి ఆహుతయినట్లు శుక్రవారం భూ యజమాని ఆవేదన వ్యక్తం చేశారు,ఈ ప్రమాదాన్ని తెలుసుకున్న రైల్వే కోడూరు సిపిఐ నాయకులు జ్యోతి చిన్నయ్య,దార్ల నాగేశ్వరరావు మరి కొంతమంది జిల్లా నాయకులు పంట పొలాల వద్దకు వెళ్లి పరిశీలించడం జరిగినది,భూయజమాని సుబ్బ నరసయ్యను కామ్రేడ్లు పరామర్శించడం జరిగినది, అధైర్య పడవద్దని ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని కామ్రేడ్లు అన్నారు అలాగే ఇంతవరకు మండల అధికారులుగాని,వ్యవసాయ అధికారులుగాని అగ్నిప్రమాదంజరిగిన భూమిని పరిశీలించలేదని వారు మండిపడ్డారు, ఇప్పటికైనా అగ్ని ప్రమాదం ఎలా జరిగింది? వాటిపైన పరిశీలించి చట్టబద్ధమైన చర్యలు తీసుకొని ఇలాంటి ప్రమాదా లు జరగకుండా జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు,

# మైన్స్, ఎక్సైజ్ శాఖలను ప్రక్షాళన చేస్తున్నాం

**రాయలసీమ ప్రాంతంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం -ఇసుక, క్వారీ నిధుల విషయంలో అనుమతులు ఇవ్వాలి**

**నేరాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి - రాష్ట్ర ఎక్సైజ్, గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**

**అనంతపురం కలెక్టరేట్, మే 22,(రిపబ్లిక్ న్యూస్):**

మైన్స్, ఎక్సైజ్ శాఖలను ప్రక్షాళన చేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, గనులు జియాలజీ శాఖ మంత్రి కొల్లు రవీంద్రపేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా గనులు ఎక్సైజ్ శాఖ అధికారులతో వేరువేరుగా మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, డిఆర్ఓ ఏ.మాలోల, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అనంతపురం మైన్స్ డిడి ఆదినారాయణ, శ్రీ సత్యసాయి జిల్లా డిఎంజివో షేక్ అమీర్ భాష, డివిజనల్ అధికారి ఓబుల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ వరప్రసాద్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ కె.ఎస్.వి.ప్రసాద్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామ్మోహన్ రెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రేవతి, నరసింహులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా గనులు శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా మైన్స్ డీడీ మాట్లాడుతూ జిల్లాలో గనుల శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యకలాపాలను, కార్యక్రమాలను వివరించారు.

**ఇసుకను కర్ణాటక, ఇతర ప్రాంతాలకు తరలించకుండా గట్టి చర్యలు తీసుకోవాలి**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తోందని, జిల్లాలో సానుకూల ప్రజా దృక్పథం మరింత మెరుగుపడాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో, క్వారీ నిధుల విషయంలో అనుమతులకు సంబంధించి సమస్యలను పరిష్కరించి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ఇసుకను కర్ణాటక, ఇతర ప్రాంతాలకు తరలించకుండా అప్రమత్తంగా ఉంటూ గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వానాకాలంలో ఇబ్బంది లేకుండా అవసరమైన ఇసుకను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త ఇసుక రీచ్ లను కూడా గుర్తించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలలో నమోదవుతున్న ఆదాయ వృద్ధి, నేరాల గుర్తింపు, అలాగే మద్యం దుకాణాలు మరియు బార్లలో జరుగుతున్న ఉల్లంఘనలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్.డి.పి.ఎల్ నేరాలను పూర్తిగా నియంత్రించడంతో పాటు, ఐడి నేరాలు మళ్లీ పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మద్యం దుకాణాలు మరియు బార్లలో జరుగుతున్న నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు



తీసుకోవాలని ఆదేశించారు.

తదనంతరం అక్కడే అర్బన్ ఎమ్మెల్యే, ఆర్టీసీ జోనల్ చైర్మన్ లతో కలిసి మంత్రి ప్రెస్ మీట్ నిర్వహించారు.

**ప్రజలకు నామ మాత్రము రుసుముతో అందిస్తున్నాం**

ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఉచిత ఇసుక విషయంలో మైనింగ్ అధికారులు పకడ్బందీగా ఉండాలనీ మైనింగ్ అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలనీ సూచించారు. నాటు సారా, మద్యం అక్రమ రవాణా, షాపుల టైమింగ్స్, ఎం ఆర్ పి విషయంలో అధికారులకు కీలక సూచనలు చేశారు. గత ప్రభుత్వంలో మైన్స్ , ఎక్సైజ్ శాఖను భ్రష్టు పట్టించారనీ, ప్రస్తుత ప్రభుత్వం వాటన్నింటినీ ప్రక్షాళన చేస్తోందనీ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రజల సౌకర్యార్థం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉచిత ఇసుక పాలసీ అమలుతో ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం లేకుండా ప్రజలకు నామ మాత్రము రుసుముతో అందిస్తున్నామని తెలిపారు. 3 లక్షల టన్నులు ఇసుకను అనంతపురము జిల్లాలోని ప్రజలకు అందించామనీ, దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన 30 కోట్ల రూపాయల ఆదాయాన్ని వదులుకుని ప్రజలకు మేలు చేకూర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామనీ అన్నారు. అక్రమాలకు తావులేకుండా కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీల ద్వారా పర్యవేక్షణ జరుగుతోంది. డిసిల్టేషన్ పాయింట్లను, రీచ్ లను ఓపెన్ చేయడం జరిగిందనీ, గత ప్రభుత్వంలో వేధింపులు ఉన్నాయనీ, ఈ ప్రభుత్వంలో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది అని అన్నారు. జొన్నగిరిలో గోల్డ్ మైనింగ్ ప్రవేట్ ఏజెన్సీ ద్వారా తవ్వి తీసే కార్యక్రమం జరుగుతోందనీ, అలాగే మన జిల్లాలో రామగిరి ప్రాంతంలో కూడా కొత్త గనుల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామనీ తెలిపారు. అనంతపురం జిల్లాలోని కలర్ గ్రానైట్ సమస్యలను పరిష్కరించి, కర్ణాటకతో ఉన్న రాయల్టీ వివాదాలను సర్దుబాటు చేస్తామనీ అన్నారు. మన ఆంధ్రప్రదేశ్ లో మైనింగ్ సంబంధిత గొప్ప నిల్వలు ఉన్నాయనీ, ఒడిశా తర్వాత అత్యధిక ఐరన్ ఓర్ సామర్థ్యం ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గుర్తు చేశారు. నెల్లూరు, ఇతర ప్రాంతాల్లో సోలార్ ప్యానెల్స్‌కు అవసరమైన క్వార్ట్జ్ నిక్షేపాలను గుర్తించామన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖపట్నంలో రెండు రేర్ ఎర్త్ మినరల్స్ పార్కులను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎక్సైజ్ పాలసీ అధ్వాన్నంగా వారు చెప్పిన బ్రాండ్ లను మాత్రమే పెట్టీ అమ్మి ప్రజలను అనారోగ్యం పాలు చేశారనీ అన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని రకాల బ్రాండ్స్ అందుబాటులో పెట్టి ప్రజలకు నాణ్యమైన మద్యం అందుబాటులో ఉంచామని అన్నారు. ఎక్సైజ్ ఆదాయం దళారులు దోచుకునే విధంగా గతంలో ఉండేది. కానీ నేడు ఆన్లైన్ విధానం ద్వారా పారదర్శకంగా ఎప్పటికప్పుడు చెక్ చేస్తూ అమలు చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం మద్యం వ్యాపారంలో దాదాపు 15,000 కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడింది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మల్టీ నేషనల్ బ్రాండ్లను అందుబాటులోకి తీసుకువచ్చామనీ అన్నారు. మద్యం నాణ్యతను పరీక్షించడానికి ఐదు ప్రాంతాలలో అత్యాధునిక లాబొరేటరీలను ఏర్పాటు చేశామన్నారు. అభివృద్ధి మరియు రాజకీయ అంశాలు రాయలసీమ ప్రాంతంలో ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనీ అన్నారు. మన రాష్ట్రానికి ప్రభుత్వంపై నమ్మకంతో అనేక ప్రాజెక్టులు వస్తున్నాయనీ, పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కియా మోటార్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి సంస్థల తరహాలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని పేర్కొన్నారు. పదవీ కాంక్షతో బురద చల్లే మాటలు జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతున్నాడనీ తెలిపారు. ఈ మధ్యనే లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో రక్షణ రంగంలో పెద్ద ప్రాజెక్ట్ సత్యసాయి జిల్లాలో శ్రీకారం చుట్టారనీ అన్నారు. అమరావతి రైతులు మన రాజధానికి మరింత భూములు అందిస్తామని ముందుకు వస్తుంటే వారిని తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారనీ ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను గమనించాలనీ అన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# జనాభా గణనను వేగవంతంగా పూర్తి చేయాలి

**: సెన్సెస్ డైరెక్టర్ నివాస్**

**నంద్యాల జిల్లాలో 83.26 శాతం జనాభా గణన పూర్తి : కలెక్టర్ రాజకుమారి**

**వలస కార్మికులు, హాస్టల్ విద్యార్థుల వివరాల నమోదుపై ప్రత్యేక దృష్టి**




**నంద్యాల బ్యూరో, మే 22 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో జనాభా గణన ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని సెన్సెస్ డైరెక్టర్ నివాస్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుండి జనాభా గణన పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, డీఆర్ఓ రామునాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం జనాభా సుమారు 21.36 లక్షలుగా నమోదవుతుండగా, ఇప్పటివరకు 83.26 శాతం గణన ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఎన్నికల అంచనాల ప్రకారం జిల్లా జనాభా సుమారు 19.13 లక్షలుగా ఉండగా, గ్రామ/వార్డు సచివాలయాల డేటా ప్రకారం అది 20 లక్షల వరకు ఉండే అవకాశముందని వివరించారు. పాణ్యం మండలంలో జనాభా గణనలో వ్యత్యాసాలు అధికంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. మండల పరిధిలో రెండు ఇంజనీరింగ్ కళాశాలలు, ఒక మెడికల్ కళాశాలతో పాటు పలు ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండటంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు అక్కడ నివసిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలు, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు మరియు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి వివరాలను సమగ్రంగా నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా, నంద్యాల పట్టణం బ్యాంకింగ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్లకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా అనేక మంది విద్యార్థులు, అభ్యర్థులు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. దీంతో కొంత సమాచారం ఇంకా నమోదు దశలో ఉన్నట్లు వెల్లడించారు. వలస కార్మికులు, చిన్నారులు, లేబర్ కాలనీలు, నిర్మాణ ప్రాంగణాల్లో నివసిస్తున్న కుటుంబాలు సాధారణ +ూబౌ పరిధిలోకి రాకపోయే అవకాశమున్నందున, అటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సెన్సెస్ డైరెక్టర్ సూచించారు. గుంటూరుఅమరావతి ప్రాంతాల్లో అమలు చేసిన విధానాలను ఆదర్శంగా తీసుకొని ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అలాగే, లాక్ చేసి ఉన్న ఇళ్లను తిరిగి సందర్శించి వివరాలను సేకరించడంతో పాటు, ఎవరూ మిగిలిపోకుండా జనాభా గణన ప్రక్రియను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# పర్యాటకాభివృద్ధితో జిల్లా స్థూల దేశీయోత్పత్తి పెరుగుదల

**పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలకు విస్తృత అవకాశాలు -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, మే 22 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడం ద్వారా జిల్లా స్థూల దేశీయోత్పత్తి (GDP) పెరుగుదలతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ప్రాంతీయ పర్యాటక అధికారి ఓబులమ్మ, జిల్లా పర్యాటక అధికారి విజయలక్ష్మి, టూరిజం కార్పొరేషన్ అధికారి లక్ష్మీనారాయణతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటకాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఇప్పటికే 22 ప్రధాన పర్యాటక ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాకు వచ్చే పర్యాటకులు ఎక్కువగా శైవక్షేత్రాల దర్శనానికే పరిమితమవుతున్నారని, ఇకపై వారికి ఆహ్లాదకరమైన వాతావరణం, నాణ్యమైన వసతి, భోజన సదుపాయాలు, వినోదాత్మక కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకువస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ఉన్న ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం నంద్యాల పట్టణంలో ప్రముఖ ప్రాంతంలో రెండు ఎకరాల భూమిని గుర్తించినట్లు



వెల్లడించారు. శ్రీశైలానికి వచ్చే భక్తులు, పర్యాటకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని దైవిక్, వి.టి.ఎస్ హాస్పిటాలిటీ సంస్థలకు కూడా స్థలాల కేటాయింపు జరిగినట్లు కలెక్టర్ చెప్పారు. సిద్ధేశ్వరం ప్రాంతంలో హెల్త్ రిసార్ట్ ఏర్పాటు చేస్తే శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు అనుకూల వాతావరణం కలుగుతుందని పేర్కొన్నారు. యాగంటి, అహోబిలం ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్టోబర్, నవంబర్ నెలల్లో బెలుం, నంది ఉత్సవాలను నిర్వహించే దిశగా సమగ్ర డీపీఆర్ సిద్ధం చేయాలని టూరిజం అధికారిని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమైన తర్వాత జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిఈఓ ను సూచించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో మరింత ఆకర్షణీయంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక ప్రాంతాల ఫోటోలు, ప్రత్యేకతలు హోమ్‌పేజీలోనే స్లైడింగ్ రూపంలో అందుబాటులో ఉంచితే పర్యాటకులను ఆకట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే గత మూడు సంవత్సరాలుగా జిల్లాకు వచ్చిన పర్యాటకుల సంఖ్యపై సమగ్ర డేటా సేకరించి విశ్లేషించాలని సూచించారు. ఇందుకోసం టూరిజం, ఎండోమెంట్స్, ఆర్టీసీ, హోటల్ అసోసియేషన్ల సమన్వయంతో సమాచారాన్ని సేకరించాలని జేసీ తెలిపారు. ప్రతి పర్యాటక ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి స్థానిక స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. బెలుం గుహలు వంటి ప్రాంతాలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్కూళ్లు, కళాశాలలు ప్రారంభమైన వెంటనే దసరా సెలవులను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా టూరిజం ప్యాకేజీల ప్రచారం చేపట్టాలని సూచించారు. అటవీ శాఖతో సమన్వయంగా పనిచేస్తే పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో పనుల పునరావృతం లేకుండా సమర్థవంతంగా ముందుకు సాగవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు.

# జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఉపాధి

## ఆదాయానికి కొత్త బాట -మంత్రి కొల్లు రవీంద్ర

**రాష్ట్ర ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించి మైనింగ్ రంగంలో 30 శాతం వృద్ధి లక్ష్యం**

**స్థానిక యువతకు భారీగా ఉద్యోగావకాశాలు**






కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 22)
రాష్ట్రంలో మైనింగ్ రంగాన్ని అభివృద్ధి చేసి సంపద సృష్టితో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలోని జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తున్న గోల్డ్ మైన్స్‌ను మంత్రి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కలిసి సందర్శించి గనుల తవ్వకాలు, ఖనిజ శుద్ధి ప్రక్రియలను పరిశీలించారు.
మంత్రి మాట్లాడుతూ జొన్నగిరి గోల్డ్ మైన్స్‌లో అత్యాధునిక సాంకేతిక పద్ధతులు వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల లోతు వరకు తవ్వకాల అవకాశముందని చెప్పారు. లోతుకు వెళ్లే కొద్దీ బంగారం నిల్వలు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతం రోజుకు సుమారు ఒక కిలో బంగారం ఉత్పత్తి అవుతుండగా, నెలకు 30 కిలోల వరకు ఉత్పత్తి జరుగుతోందన్నారు.
జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో సుమారు 13 వేల టన్నుల ఖనిజ నిల్వలు ఉన్నాయని అంచనా వేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు రెండు లక్షల టన్నుల ఖనిజాన్ని ప్రాసెసింగ్ చేసినట్లు తెలిపారు. దేశంలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టులలో జొన్నగిరి మైన్ ఒకటిగా నిలుస్తోందన్నారు.
రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఇంకా విస్తృత అవకాశాలు ఉన్నాయని, అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైనింగ్‌కు అనుకూల ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. అలాగే విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ అభివృద్ధికి బ్లాకులను గుర్తించి టెండర్ ప్రక్రియలు కొనసాగుతున్నాయని తెలిపారు. క్వార్ట్జ్ ఆధారిత విలువ ఆధారిత పరిశ్రమలు, సోలార్ ప్యానెల్ తయారీ యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.
గ్రానైట్ ఖనిజానికి అంతర్జాతీయ మార్కెట్లో భారీ డిమాండ్ ఉందని, వాటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి అలంకార వస్తువుల తయారీకి ప్రోత్సాహం అందించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలో జొన్నగిరి గోల్డ్ మైన్స్‌ను సందర్శించే అవకాశం ఉందన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలో సరైన ప్రోత్సాహం లేక ప్రాజెక్ట్ ముందుకు సాగలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అనుకూల వాతావరణం కల్పించడంతో గోల్డ్ మైన్



కార్యకలాపాలు వేగవంతమయ్యాయని తెలిపారు. ఇప్పటికే 300 నుంచి 400 మంది స్థానిక యువతకు ఉద్యోగాలు లభించాయని, వలసలు తగ్గుముఖం పట్టాయని చెప్పారు.
గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పర్యావరణ అనుమతులు, నీటి కేటాయింపులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఓపెన్ మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమైతే మరింత పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఓబులేసు, టీడీపీ జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, బోయ కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగిని, డీఎస్పీ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాముల డోర్ లాక్ సీళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, మే 22 (రిపబ్లిక్ న్యూస్):**భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మాసపు తనిఖీల్లో భాగంగా నంద్యాల పట్టణంలోని టేక్కే మార్కెట్ యార్డ్‌లో భద్రపరిచిన ఈవీఎంల గోదాములను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాముల డోర్ లాక్ సీళ్ల స్థితిని పరిశీలించిన కలెక్టర్, ఈవీఎంల భద్రతకు సంబంధించిన రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా అమలవుతున్నాయా అనే అంశాలను సమగ్రంగా సమీక్షించారు. ఈవీఎంల భద్రత అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్న కలెక్టర్, గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ లాగ్‌బుక్‌ను పరిశీలించి, విధుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ పనితీరును పరిశీలించిన కలెక్టర్, అగ్నిమాపక పరికరాల అందుబాటు మరియు వాటి పనితీరుపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. డోర్ లాక్ సీళ్ల భద్రతా అంశాలను పరిశీలిస్తూ, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# పీఎం సూర్య ఘర్ పనుల్లో నిర్లక్ష్యం విడనాడండి

**లక్ష్యాల సాధనలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, మే 22 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం అమలులో పురోగతిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి మండల స్థాయి విద్యుత్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్, డీఈలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ మరియు కుసుమ్ పథకాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాకు కేపెక్స్ మరియు యూఏఎం మోడల్ల కింద కలిపి 51 వేల లక్ష్యాలు కేటాయించగా, ఇప్పటివరకు కేవలం 4,047 పనులు మాత్రమే పూర్తవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కేపెక్స్ మోడల్ కింద 22,655 అప్లికేషన్లు, యూఏఎం మోడల్ కింద 28,326 అప్లికేషన్లు నమోదైనప్పటికీ, పురోగతి సాధించలేకపోయారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు చేరువై అవగాహన కల్పించడం, లబ్ధిదారులతో ప్రత్యక్ష సమన్వయం కల్పించడం, బ్యాంకు రుణ సదుపాయాలు మరియు విద్యుత్ కనెక్షన్ ప్రక్రియలను వేగవంతం చేయడంలో అధికారులు పూర్తి శ్రద్ధ వహించాలన్నారు. పనితీరు మెరుగుపరచుకోకపోతే సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. నంద్యాలతో పాటు ఆత్మకూరు రూరల్‌లో 3,734 లక్ష్యాలకు గాను కేవలం 62 మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. వెండర్లతో సమన్వయం పెంచి, లబ్ధిదారులకు బ్యాంకింగ్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చి, విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను గట్టిగా ఆదేశించారు.

# మే31 మహాసభను జయప్రదం చేయాలి

**-- రాయలసీమ సాగునీటి సాధన సమితి పిలుపు**



**బండిఆత్మకూరు,మే22, (రిపబ్లిక్ న్యూస్ ):-** ఈ నెల 31న నంద్యాలలో నిర్వహించనున్న 'సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన' 10వ వార్షికోత్సవ మహాసభ విజయవంతానికై రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యవర్గ సభ్యులు ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఇందులో భాగంగా బండిఆత్మకూరు మండలంలోని పార్నపల్లె, సంత జూటూరు, బండిఆత్మకూరు గ్రామాలలో సమితి కార్యవర్గ సభ్యులు రాఘవేంద్రగౌడ్, పట్నం రాముడు గార్లు విస్తృతంగా పర్యటించారు. ఇక్కడి రైతాంగంతో సమావేశమై రాయలసీమ ఎదుర్కొంటున్న తీవ్ర సాగునీటి సమస్యలపై అవగాహన కల్పించారు. మే 31న జరిగే మహాసభకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమితి నాయకులు రాఘవేంద్రగౌడ్, పట్నం రాముడు మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాయలసీమ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలు గడుస్తున్నా సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం, పాలకుల వైఫల్యాల వల్లే నేడు సాగునీటి హక్కులు ఉండి కూడా రైతాంగం కరవు బారిన పడాల్సి వస్తోందని మండిపడ్డారు. రాయలసీమలో పండే ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలకు సరైన మద్దతు ధరలు కల్పించకపోవడం వల్ల రైతులు అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వందేళ్ళ చరిత్ర వున్న కెసి కెనాల్ స్థిరీకరణకు గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం, సిద్దేశ్వరం అలుగు నిర్మాణాలను తక్షణమే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2016 మే 31న 30,000 మందితో సాగిన 'సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన' స్ఫూర్తితో.. రాయలసీమ ఆత్మగౌరవాన్ని, హక్కులను చాటిచెప్పడానికి నంద్యాలలో జరిగే 10వ వార్షికోత్సవ మహాసభ ఒక వేదిక కానుందని సమితి నాయకులు స్పష్టం చేశారు. ఈ హక్కుల పోరాటంలో ప్రతి ఒక్క రైతు భాగస్వామి కావాలని, మన గళమే సీమ భవిష్యత్తుకు దిక్సూచి అని పేర్కొంటూ.. బండిఆత్మకూరు మండల రైతాంగం స్వచ్ఛందంగా తరలివచ్చి మహాసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com